# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 26-11-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 83 పేజీలు:6 వెల: రూ.1/-


## చైనాలో ఆల్‌టైమ్ హైకి రోజువారీ కరోనా కేసులు

బీజింగ్, నవంబర్ 25: చైనాలో కరోనా కేసులు ఆల్‌టైమ్ హైకి చేరుకున్నాయి. మహమ్మారి విజృంభణతో వైరస్‌బారిన పడుతున్న వారిసంఖ్య రోజురోజుకు పెరిగిపోతున్నది. గురువారం రికార్డు స్థాయిలో 31 వేలకుపైగా పాజిటివ్ కేసులు నమోదవగా, నేడు 32,695 మందికి వైరస్ నిర్ధారణ అయింది. ఇందులో 3041 మందికి కరోనా లక్షణాలు ఉండగా, 29,654 మందికి ఎలాంటి లక్షణాలు లేవని అధికారులు తెలిపారు. దీంతో వైరస్ విజృంభణను నిలువరించడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఎక్కువ కేసులు నమోదవుతున్న పట్టణాల్లో లాక్‌డౌన్లు విధిస్తున్నారు. తాజాగా రికార్డయిన పాజిటివ్ కేసుల్లో అత్యధికంగా గ్వాంగ్‌జౌ, ఛోంగ్‌క్వింగ్ పట్టణాల్లో ఉన్నాయి. ఛెంగ్డూ, జినాన్, లాన్‌జౌ, గ్జినా, వుహాన్ పట్టణాల్లో కూడా భారీ సంఖ్యలో కొత్త కేసులు నమోదవుతున్నాయి. దీంతో ఆయా పట్టణాల్లో ప్రజలు అత్యవసరమైతే తప్ప తమ ఇండ్ల నుంచి బయటకు రాకూడని అధికారులు ఆదేశాలు జారీచేశారు. ఏప్రిల్ నెలలో షాంఘైలో భారీగా కరోనా కేసులు వెలుగు చూసిన విషయం తెలిసిందే. దీంతో వైరస్ వ్యాప్తిని అడ్డుకోవడానికి జీరో కోవిడ్ విధానంలో భాగంగా రెండు నెలల పాటు కఠినంగా ఆంక్షలు అమలు చేశారు. అయితే అక్కడ వైరస్‌ను నిలువరించినప్పటికీ.. ఇతర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో కొత్త కేసులు నమోదవుతూ వస్తున్నాయి. దీంతో కరోనా పుట్టినిల్లయిన చైనాలో రికార్డు స్థాయిలో పాజిటివ్ కేసులు పెరుగుతున్నాయి.

## పీఎస్ఎల్‌వీ సీ-54 రాకెట్ ప్రయోగానికి కౌంట్ డౌన్..



అమరావతి: నవంబర్ 25:నెల్లూరు జిల్లాలోని శ్రీహరికోటలోని షార్ నుంచి రేపు ఉదయం 11.56గంటలకు పీఎస్ఎల్‌వీ సీ-54 రాకెట్ ప్రయోగానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఈ ఉదయం 10.56గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. 1117కిలోల ఓషన్ శాట్-3- (ఈవోఎస్-06), ఇండియా భూటాన్ దేశాలు సంయుక్తంగా రూపొందించిన 18.28 కిలోల అకా ఐఎన్ఎ?స-2బీ, భారత్‌కు చెందిన ధ్రువ స్పేస్ ఇండియా ప్రైవేట్ కంపెనీకి చెందిన 1.45 కిలోల బరువు గల రెండు థైబోల్ట్ ఉప్రగ్రహాలు, పిక్సిల్ ఇండియా కంపెనీకి చెందిన 16.51 కిలోల ఆనంద్, అమెరికాకు చెందిన 17.92 కిలోల బరువు గల ఆస్ట్రోకాస్ట్-2 పేరుతో నాలుగు ఉపగ్రహాలను ఈ రాకెట్ ద్వారా కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. రాకెట్ నింగికెగసిన అనంతరం నాలుగు దశలను పూర్తిచేసుకొని చివరి దశలో ఉపగ్రహాలను కక్ష్యలోకి విడిచిపెడుతుంది.

## రాష్ట్రంలో కొత్తగా స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేయాలి-సి.ఎస్. సోమేశ్ కుమార్



హైదరాబాద్, నవంబర్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); :: రాష్ట్రంలో కొత్త సభ్యులతో నూతన స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ ఆదేశించారు. రాష్ట్రంలో స్వయం సహాయక బృందాల పనితీరుపై బీఆర్ కేఆర్ భవన్లో నేడు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఐటి,పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, పంచాయితీ రాజ్ శాఖ కార్యదర్శి రఘునందన్ రావ్, జీహెచ్ ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్ సోమేశ్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 6,06,000 స్వయం సహాయక బృందాలలో 64 లక్షల మంది సభ్యులున్నారని తెలిపారు. వీటిలో గ్రామీణ ప్రాంతాల్లో 4 ,30 ,785 బృందాలలో 46 కుపైగా సభ్యులుండగా, పట్టణ ప్రాంతాల్లో ఉన్న 1,76,623 బృందాలలో దాదాపు 18 లక్షల మంది సభ్యులున్నారని వెల్లడించారు. గ్రామాలు, పట్టణాలలో గ్రూపుల్లో చేరని సభ్యులను గుర్తించి కొత్త గ్రూపులు ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్.హెచ్.జి గ్రూపులు, సభ్యుల వివరాలను పూర్తి స్థాయిలో అప్-డేట్ చేయాలని, అనంతరం గ్రూపుల్లోని సభ్యులందరికీ క్యూఆర్ కోడ్ కలిగిన ప్రత్యేక గుర్తింపు కార్డు జారీ చేయాలని సి.ఎస్ ఆదేశించారు. ప్రస్తుతం బ్యాంకుల ద్వారా పొందుతున్న వడ్డీ లేని రుణాల మొత్తాలను ఉత్పాదక రంగాలలో ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని సోమేశ్ కుమార్ సూచించారు. స్వయం సహాయక బృందాల సభ్యులకు వివిధ రంగాల్లో ప్రత్యేక శిక్షణ ఇప్పించడం ద్వారా వారి ఆదాయ మార్గాలను పెంపొందించేందు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జీహెచ్ ఎంసీ అడిషనల్ కమిషనర్ శృతి ఓఝా, సెర్ప్ డైరెక్టర్ వై.ఎన్. రెడ్డి, శ్రీనిధి ఎండి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## జిద్దాను వణికిస్తున్న భారీ వర్షాలు.. ఇద్దరు మృతి..!

న్యూఢిల్లీ, నవంబర్ 25: సౌదీ అరేబియాలోని జిద్దా నగరాన్ని భారీ వర్షాలు వణికిస్తున్నాయి. జిద్దా నగరంతోపాటు దాని పరిసర ప్రాంతాల్లో గురువారం నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన ఎడతెరిపి లేని భారీ వర్షం కురుస్తోంది. భారీ వర్షాల కారణంగా వచ్చిన వరదలతో జనజీవనం అస్తవ్యస్తమైంది. వర్షాల కారణంగా ఇప్పటి వరకు ఇద్దరు మృతి చెందినట్లు స్థానిక అధికారులు తెలిపారు. గురువారం రాత్రి 8గంటల నుంచి శుక్రవారం తెల్లవారుజామున 9 గంటలవరకు (కేవలం 6గంటల్లోనే) 179మి.మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అక్కడి అధికారులు వెల్లడించారు. భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయుమయ్యాయి. వరదలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మరోవైపు పాఠశాలలు, కళాశాలలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. వాతావరణం అనుకూలించని కారణంగా పలు విమానాలు ఆలస్యంగా నడుస్తున్నట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు.

13ఏళ్ల క్రితం 2009లో కురిసిన వర్షానికి జిద్దా నగరం మునిగిందని .. మళ్లీ ఇప్పుడు అంతటి వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. అప్పుడు కురిసిన వర్షాల కారణంగా వచ్చిన వరదల్లో 123 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయినట్లు వివరించారు.

### చరిత్రలో నేటినిజం



కం॥ పాదద్వంద్వము మ్రొక్కగ
వేదాత్ముం డరసి కురిసె వేలశుభములన్
నాదమె సర్వస్వంబును
సాధకుండగు 'రమేషు నాయుడు' ప్లైననే



(నవంబర్ 26 రమేష్‌నాయుడు జయంతి..)

-రాధశ్రీ సెల్:9494481210

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

## ముస్లిం మైనారిటీల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత

### -ముఖ్యమంత్రి కే . చంద్రశేఖర్ రావు

హైదరాబాద్ నవంబర్ 25(ఎక్స్ ప్రెస్ న్యూస్ );రాష్ట్ర ముఖ్యమంత్రి కే . చంద్రశేఖర్ రావు గారి నాయకత్వంలో ప్రభుత్వం ముస్లిం మైనారిటీల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ వారు సామాజికంగా , ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు వారికి ఉద్యోగ , ఉపాధి అవకాశాల కల్పన దిశగా పలు చర్యలను తీసుకుంటున్నది. ముస్లిం మైనారిటీల జీవితాల్లో మార్పులు తేవాలని ప్రభుత్వం ఆచరణాత్మక విధానాన్ని అమలు చేస్తున్నది. 2022-23 బడ్జెట్లో మైనారిటీల సంక్షేమం కోసం గతం లో ఎన్నడూ లేని విధంగా రూ.1724.696 కోట్లు కేటాయించింది. ఇతర వర్గాలతో సమానంగా మైనారిటీలకు సముచితమైన వాటా దక్కేలా చూడటంతో పాటు వారి సంక్షేమం కోసం పలు పథకాలు అమలు చేస్తున్నది.

ఎస్.సి, ఎస్.టి , బి.సి ల తో సమానంగా మైనారిటీల కోసం షాదీ ముబారక్ ను అమలు చేస్తున్నది. ఇప్పటి వరకు 2014 -15 నుండి ఇప్పటి వరకు 2,28,200 మందికి ఆర్థిక సహాయం అందించడమైనది. షాదీ ముబారక్ పథకం ద్వారా ఒక్కొకరికి రూ.1,00,116 /- ఆర్థిక సహాయం ఇవ్వడం జరుగుచున్నది. దీని ద్వారా పేద మైనారిటీలకు ఎంతో మేలు చేకూరుతున్నది. తమ ఆడ పిల్లల వివాహాలకు ఎదుర్కొంటున్న సమస్యలు తీరిపోయాయి. 2014-15 నుండి 2022-23 వరకు రూ.2165 కోట్లు ఈ పథకానికి కేటాయించడమైనది.

రాష్ట్రంలో కే.జి తో పి.జి విద్యలో భాగంగా మైనారిటీలను ఉచిత విద్యను ఉన్నత ప్రమాణాలతో అందించాలని 204 మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రారంభించడంతో పాటు జూనియర్ కాలేజీలుగా అప్ గ్రేడ్ చేయడం జరిగింది. మైనారిటీ విద్యాసంస్థలలో 1,30,560 మంది విద్యార్థినీ విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నాయి. ఒక్కొక్క సంస్థలలో 640 మంది విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియంలో విద్యా బోధన జరుగుచున్నది. 107 బాలురు , 97 బాలికలకు సంబంధించిన విద్యాలయాలు ఉన్నాయి. విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించి వారికి విలువతో కూడుకున్న పరిజ్ఞానం అందించడం , తద్వారా ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దబడాలనే లక్ష్యంగా పనిచేస్తున్నాయి.

మైనారిటీ విద్యార్థులు విదేశాలలో ఉన్నత విద్య అభ్యసించడానికి సి. ఏం. ఓవర్ సీస్ స్కాలర్ షిప్ పథకాన్ని 2015 ? 2016 లో ప్రారంభించడం జరిగింది. 2015 నుండి ఇప్పటివరకు 2725 మంది ఈ పథకానికి ఎంపిక అయ్యారు. 436 కోట్ల ఆర్థిక సహాయం అందించడమైనది. ఒక్కొక్క విద్యార్థికి 20 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. 2022-23 బడ్జెట్ లో 100 కోట్లు కేటాయించడమైనది. మైనారిటీ విద్యార్థుల పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్ లో రూ. 40 కోట్లు , ట్యూషన్ ఫీజు రీయంబర్స్ మెంట్ కు రూ. 150 కోట్లు కేటాయించడమైనది.

మైనారిటీ సంక్షేమ శాఖలో 66 మంది ఉర్దూ ట్రాన్స్ లెటర్లను నియమించడం జరిగింది. ఫకీర్ కమ్యూనిటీ వారి సంక్షేమార్థం 110 మోపెడ్స్ ను పంపిణీ , రంజాన్ సందర్భంగా గిఫ్ట్ ప్యాకెట్ల పంపిణీ , ప్రతినెలా ఇమామ్ లకు రూ. 10 వేలు , మౌజమ్ లకు రూ. 5 వేల హనరోరియమ్ , 100 మంది మైనారిటీ విద్యార్థులకు ఐ.ఏ.ఎస్ కోచింగ్ , మక్కా మసీదు రిపేర్లకు రూ. 8.48 కోట్లు , అనీసుల్ గుర్బాకు రూ. 39 కోట్లు , జహంగీర్ పీర్ దర్గా అభివృద్ధికి 50 కోట్లు ,జామియా , నిజామియా ఆడిటోరియం కు రూ.14.65 కోట్లు . ఇస్లామిక్ ఉ కల్చరల్ కన్వెన్షన్ సెంటర్ కు రూ. 40 కోట్లు కేటాయించడమైనది. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఓన్ యువర్ ఆటో , డ్రైవర్ ఎంపవర్ మెంట్ పథకం , కుట్టు మిషన్ల పంపిణీ , సబ్సిడీ తో కూడిన బ్యాంక్ రుణాలు , స్కిల్ డెవలప్ మెంట్, తదితర కార్యక్రమాలు అమలు చేయబడ్డాయి.

## రాష్ట్రంలో సజావుగా ధాన్యం కొనుగోళ్లు : గంగుల

హైదరాబాద్, నవంబర్ 25: సీఎం కేసీఆర్ ఆదేశాలతో రాష్ట్రలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా జరుగుతుందని పౌర సరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. ఇప్పటి వరకు 6,129 కొనుగోలు కేంద్రాల్లో 26లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. గతేడాది కంటే ఈ సారి ఇదే సమయానికి 8లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికంగా సేకరించినట్లు పేర్కొన్నారు. కోతలు జరుగుతున్న ప్రాంతాల్లో 6,129 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడమే కాకుండా 35 కేందాల్లో కొనుగోళ్లు పూర్తికావడంతో మూసివేసినట్లు పేర్కొన్నారు.

రాష్ట్రంలోని 4.16లక్షల మందికిపైగా రైతుల నుంచి దాదాపు 26 లక్షల మెట్రిక్ టన్నులను సేకరించామని ఈ ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు చేరవేస్తున్నట్లు చెప్పారు. మిల్లర్లు గుర్తించిన విలువ రూ.2,390 కోట్లకు గాను రూ.2,154 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. సాధారణంగా నవంబర్, డిసెంబర్ మాసాల్లోనే అధికంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని, అందుకనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. గన్నీ సంచులు, టార్పాలిన్లు, మాయిశ్చర్ మిషన్లు, ప్యాడీక్లీనర్లు తదితర సౌకర్యాలు కల్పించినట్లు వివరించారు.

## నగర సిగలో మరో వంతెన.. శిల్పా లేవుట్ పై ఓవర్‌ను ప్రారంభించిన కేటీఆర్



హైదరాబాద్, నవంబర్ 25: నగరంలో మెట్రో, ఎంఎంటీఎస్ విస్తరణపై మంత్రి కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. నగరంలో కొత్తగా అందుబాటులోకి వచ్చిన శిల్పా లే అవుట్ ఫ్లైఓవర్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ మాట్లాడారు. నగరం విస్తరిస్తున్నందున ప్రజారవాణాపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉ ందన్నారు. 'ఎంఎంటీఎస్ కోసం రూ.200కోట్లు విడుదల చేయాలని ఆర్థికశాఖకు సీఎం కేసీఆర్ ఆదేశాలు ఇచ్చారు. ఈ నిధులతో ఎంఎంటీఎస్‌ను విస్తరణ చేపడుతాం. మెట్రో రెండో దశకు సంబంధించి కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నం. సహకరిస్తారని ఆశిస్తున్నాం. సహకరించినా, సహకరించకపోయినా మొదటి దశ ఎట్లాయితే విజయవంతంగా పూర్తి చేశామో రెండో దశను పూర్తి చేస్తాం. బీహెచ్‌ఈఎల్ నుంచి లక్డీకపూల్ వరకు 26 కిలోమీటర్లు, నాగోల్ నుంచి ఎల్‌బీనగర్ వరకు 5 కిలోమీటర్లు, మైండ్‌స్పేస్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వరకు 32 కిలోమీటర్లు కొత్తగా మెట్రో నిర్మిస్తాం. కొవిడ్‌తో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు నష్టం తగ్గిన విషయం మీ అందరికీ తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం సహాయ నిరాకరణ చేయడంతో ఇబ్బంది ఎదురవుతున్న విషయం తెలిసిందే. రెండు కారణాలతో అనుకున్న విధంగా ప్రణాళిక ప్రకారం.. మెట్రో విస్తరించాలనుకున్నా చేయలేకపోయాం. రాబోయే రోజుల్లో దీన్ని ముందుకు తీసుకుపోయే బాధ్యత తెలంగాణ ప్రభుత్వానిదే'నని కేటీఆర్ స్పష్టం చేశారు.

జనవరిలో కొత్తగూడ ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తాం..

'ఈ రోజు ప్రారంభించిన శిల్పా లేఅవుట్ ఫ్లై ఓవర్ 2.8 కిలోమీటర్లు దీని పొడువు. అనుకున్న సమయానికి నిర్మించిన సంస్థకు ధన్యవాదాలు. 2.8 కిలోమీటర్ల ఫ్లై ఓవర్ షేక్‌పేట ఫ్లై ఓవర్‌తో సమానంగా హైదరాబాద్‌లోనే రెండో పొడువైన వంతెనగా నిలుస్తుంది. గచ్చిబౌలిలో 50శాతం వాహనదారులకు ఊరట కలుగుతుంది. కొండాపూర్ ఫ్లైఓవర్ రాబోయే తొమ్మిది పది నెలల్లో అందుబాటులోకి తీసుకువస్తాం. డిసెంబర్, జనవరిలో కొత్తగూడ ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తాం. బొటానికల్ గార్డెన్, కొండాపూర్ ప్రాంతాలకు ఊరటనిచ్చే ఫ్లై ఓవర్ అందుబాటులోకి వస్తాం.

ఎమ్మెల్యే గాంధీ ప్రతిపాదనలు తీసుకొని పూర్తి చేస్తాం. అత్యుత్తమ జీవన ప్రమాణాలు కలిగిన నగరంగా హైదరాబాద్ తీర్చిదిద్దే దిశగా విద్యుత్ వ్యవస్థను, శాంతిభద్రతలు, భారత దేశంలో ఎక్కడా లేనివిధంగా కమాండ్ కంట్రోల్ సెంటర్, మంచినీళ్లు, రోడ్లను బాగు చేసుకుంటున్నాం. ఒక డ్రైనేజీ వ్యవస్థ మిగిలిందని, దాన్ని కూడా బాగు చేయాల్సిన అవసరం ఉంది. దాన్ని కూడా పూర్తి చేసే బాధ్యత మాదే'న న్నారు. స్వల్ప కాలంలో శిల్పా లే అవుట్ ఫ్లై ఓవర్ స్వల్ప కాలంలో నిర్మించి, అందుబాటులోకి తెచ్చినందుకు ఎస్సార్డీపీ సీఈ, ఎస్‌ఈ, సిబ్బంది అందరికీ నగర ప్రజల తరఫున కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు.

## పేదల చెంతకు ప్రభుత్వ వైద్యం చారిత్రక నిర్ణయం : మంత్రి సబితా ఇంద్రారెడ్డి



రంగారెడ్డి, నవంబర్ 25: రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని , దీంట్లో భాగంగా పేదల వద్దకే వెళ్లి ప్రభుత్వ వైద్యాన్ని అందించడం చారిత్రక నిర్ణయమని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు.

మహేశ్వరం నియోజకవర్గం జలపల్లి మున్సిపాలిటీ పహాడి షరీఫ్ దర్గా సమీపంలో, కొత్తపేట్ గ్రామంలో బస్తీ దవఖానాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో బస్తీలలో నివాసముండే నిరుపేదల చెంతకే వైద్యం అందించేందుకు ఏర్పాటు చేసిన బస్తీ దవఖానాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలపల్లి మున్సిపాలిటీ చైర్మన్ అబ్దుల్లా సాది, రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, రంగారెడ్డి జిల్లా బస్తీ దరఖాన ఇన్‌చార్జి వినోద్ కుమార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ శారద శ్రీనివాస్, జల్‌పల్లి మున్సిపాలిటీ టీఆర్‌ఎస్ అధ్యక్షులు ఇక్బాల్ బిన్ ఖలీఫా, వర్కింగ్ ప్రెసిడెంట్ జనార్ధన్ ,కౌన్సిలర్లు శంషుద్దీన్, మజర్, కోఆప్షన్ సభ్యుడు కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు

## విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి : తలసాని



హైదరాబాద్, నవంబర్ 25: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. అమీర్‌పేటలోని మున్సిపల్ గ్రౌండ్‌లో తలసాని యువసేన ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు క్రికెట్ టోర్నమెంట్ జరుగనున్నది. పోటీల్లో సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ కాలేజీలకు చెందిన 80 జట్లు పాల్గొననున్నాయి. ఈ సందర్భంగా మంత్రి ముఖ్య అతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు. తలసాని యువసేన ఆధ్వర్యంలో 2014 నుంచి ఏటా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రోజు రోజుకు క్రికెట్‌కు ఆదరణ పెరుగుతోందన్నారు. కీడ్రల్లో గెలుపు, ఓటములను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. రోజులో కొంత సమయం క్రీడలకు కేటాయించడంతో మానసిక ప్రశాంతతో పాటు ఆరోగ్యవంతమైన జీవనం లభిస్తుందన్నారు. ఇలాంటి పోటీలను వేదికలుగా చేసుకొని క్రీడాకారులు తమ సత్తా చాటాలన్నారు. అనేకమంది క్రీడా పోటీల్లో ప్రతిభను చాటి జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదిగారని మంత్రి గుర్తుచేశారు.

పోటీల్లో విజేతలకు రూ.25వేలు, రూ.15వేల ప్రైజ్ మనీతో పాటు ఖరీదైన క్రికెట్ కిట్లను అందించనున్నట్లు సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ పేర్కొన్నారు. మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, ఎస్‌ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదులు, టీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, నిర్వాహకులు సచిన్, ముఖేష్, టీఆర్‌ఎస్ నాయకులు అశోక్ యాదవ్, ప్రవీణ్ రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, వనం శ్రీనివాస్, బాసా లక్ష్మి, లలితా గోపిలాల్ తదితరులు పాల్గొన్నారు.

## అటవీ అధికారులు, సిబ్బందికి భరోసా కల్పించండి.. పోలీసుకు డీజీపీ ఆదేశం

హైదరాబాద్, నవంబర్ 25: అటవీ అధికారులు, సిబ్బందికి మద్దతుగా నిలవాలని, భరోసా కల్పించాలని పోలీసులను డీజీపీ మహేందర్ రెడ్డి ఆదేశించారు. కొత్తగూడెం లాంటి సంఘటలను పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. అటవీశాఖ, క్షేత్ర స్థాయి సిబ్బంది సమస్యలపై అటవీ సంరక్షణ ప్రధాన అధికారి డోబ్రియల్‌తో కలిసి డీజీపీ మహేందర్ రెడ్డి పోలీస్ ఉన్నతాధికారులు, ఎస్పీలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా తమ పరిధిలోని చీఫ్ కన్జర్వేటర్లు, జిల్లా అటవీ అధికారులతో స్వయంగా సమావేశం కావాలని పోలీస్ కమిషనర్లు, జిల్లాల ఎస్పీలకు సూచించారు. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలన్నారు.

డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు కూడా తమ పరిధిలోని అటవీ అధికారులతో సమావేశం కావాలని ఆదేశించారు. విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల రక్షణ, భద్రతకు ప్రాధాన్యతనివ్వాలని అధికారులకు సూచించారు.

## భ్రూణ హత్యలు మహాపాపమని, వాటిని నివారించి ఆడపిల్లలను రక్షిద్దాం

మెదక్, నవంబర్ 25: నేటినిజం (ప్రతినిధి):భ్రూణ హత్యలు మహాపాపమని, వాటిని నివారించి ఆడపిల్లలను రక్షిద్దామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విజయ నిర్మల అన్నారు. గర్భస్థ పూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం 1996 కఠినంగా అమలు చేయడంపై శుక్రవారం తన ఛాంబర్ లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సలహా సంఘ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో వేయి మంది పురుషులకు 946 మంది మహిళలు ఉన్నారని, ఈ నిష్పత్తిని రూపుమాపుటకు అందరం కలిసి కట్టుగా కృషి చేయాలని అన్నారు. సమాజంలో ఆడ, మగ అందరు సమానామేనని ఈ చట్టం చెబుతుందని, చట్టం ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ప్రజలలో అవగాహన కలిగించాలని అన్నారు. జిల్లాలో 36 స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయని, మరో రెండు కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తులు వచ్చాయని, అందరు కూడా ఈ లింగ నిర్ధారణ చట్టంకు లోబడి స్కానింగ్ చేయవలసి ఉంటుందని అన్నారు. గైనకాలజిస్ట్ లేదా రేడియాలజిస్ట్ మాత్రమే స్కానింగ్ చేయాలని అన్నారు. తల్లి ఆరోగ్యం విషమించిన, లేదా గర్భంలోని బిడ్డకు ప్రాణాపాయ స్థితి ఉన్న 24 వారాల వరకు స్కానింగ్ చేసి గర్భస్రావం చేయవచ్చని అన్నారు. విషమ పరిస్థితులలో స్కానింగ్ చేసినప్పుడు ఎట్టి పరిస్థితులలో ఆడ,మగ బిడ్డ అని తెలుపరాదని అన్నారు. చాలా మంది ఇద్దరు ఆడపిల్లల తరువాత గర్భం దాలిస్తే లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకొని గోప్యంగా గర్భస్రావం చేయించుకోవటానికి ప్రయత్నిస్తున్నారని, ప్రధానంగా ఇక్కడ వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఇతర ప్రాంతాలలో వివిధ కారణాలు చెప్పి గర్భం తీయించుకుంటున్నారని అన్నారు. అత్యవసరమైతే సెకండ్ ఒపీనియన్ లేదా కమిటీ అనుమతి తీసుకోవాలని అన్నారు. అదృష్టవశాత్తు మన జిల్లాలో ఎటువంటి కేసులు నమోదు కాలేవని, అయినా అప్రమత్తం ఉంటూ ప్రైవేట్ స్కానింగ్ కేంద్రాలలో నిఘా పెట్టాలని అన్నారు . లింగ నిర్ధారణ పరీక్షలకు ప్రోత్సహించిన, పరీక్షలు చేసిన వారిపై చట్టం ప్రకారం మొదటి సారి నేరానికి 3 సంవత్సరాల కారాగారం, 50 వేల జరిమానా, రెండవసారి నేరానికి 5 సంవత్సరాల జైలు, లక్ష రూపాయల జరిమానా ఉంటుందని, అన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఏ.యెన్.ఏం లు లింగ నిర్ధారణ పరీక్షల పట్ల ప్రజలలో అవగాహన కలిగించాలని అన్నారు. ఇటువంటి సంఘటనలు జరిగితే వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. తద్వారా చట్టం పట్ల, కమిటీ పట్ల ఇతరులు లింగ నిర్ధారణ పరీక్షలు చేయుటకు బయపడతారని ఆమె అన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు గైనకాలజిస్ట్ శివదయాళ్, చిన్న పిల్లల వైద్యులు చంద్రశేఖర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ షేక్ ఫజల్ అహ్మద్, డిపిఆర్ ఓ శాంతి కుమార్, మాయ వెంకటేష్ , మాస్ మీడియా అధికారి రమ తదితరులు పాల్గొన్నారు.



# దేశ సర్వతోముఖాభివృద్ధికి రాజ్యాంగమే పునాది

## (26 నవంబర్ "భారత రాజ్యాంగ దినోత్సవం" సందర్భంగా)

26 నవంబర్ 1949న భారత రాజ్యాంగాన్ని చట్టసభ ఆమోదించిన శుభ సందర్భంగా ప్రతియేట 26 నవంబర్ రోజున "భారత రాజ్యాంగ లేదా భారత చట్ట లేదా సంవిధాన్ దినోత్సవం" ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. ఇదే భారత రాజ్యాంగం 26 జనవరి 1950న అమలులోకి వచ్చింది. 11 అక్టోబర్ 2015 రోజున రాజ్యాంగ నిర్మాత డా: బి ఆర్ అంబేడ్కర్ 125వ జన్మదిన వేడుకల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుతో రాజ్యాంగ దినం జరుపుకుంటున్నాం. అంతకు పూర్వం 26 నవంబర్‌ను జాతీయ చట్ట దినోత్సవం (నేషనల్ లా డే)గా పాటించేవారు. దేశానికి ఆయువు రాజ్యాంగం. శాంతియుత సహజీవన సారాన్ని బోధించేది రాజ్యాంగమే. భారత రాజ్యాంగం పట్ల ప్రజలు, యువత, విద్యార్థినీవిద్యార్థుల్లో సంపూర్ణ అవగాహన కల్పించడంతో పాటు మాక్ పార్లమెంట్ నిర్వహణ లక్ష్యాలతో రాజ్యాంగ దినం నిర్వహిస్తారు.

రాజ్యాంగమే పవిత్ర గ్రంథం:

సంఘ సంస్కర్త, నిబద్ధతగల రాజకీయ నాయకుడు, మేధావి, న్యాయకోవిదుడు, భారత రాజ్యాంగ రచన కమిటీ చైర్మన్ డా: అంబేడ్కర్‌ను రాజ్యాంగ పితామహుడిగా కొనియాడడం మనందరి కనీస బాధ్యత అని మరువరాదు. భారత రాజ్యాంగ ఉపోద్ఘాతం (ప్రియాంబుల్)లో పొందుపరిచిన పౌరుల హక్కులు, బాధ్యతలను పాటిస్తూ, దేశభక్తిపరులుగా నిరూపించుకోవాలి. అందరికి సమన్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావాలను కల్పించిన రాజ్యాంగమే ప్రజలకు పవిత్రగ్రంథం కావాలి. భారత రాజ్యాంగం గీసిన గీతను దాటిన వారు నేరస్థులుగా శిక్షార్హులు అవుతారు. రాజ్యాంగం నిర్మాతలు సూచించిన మార్గం, రాజ్యాంగంలోని విలువలు మరియు స్ఫూర్తితో ముందుకు సాగిన జనులు జాతి నిర్మాతలుగా పరిగణించబడతారు. 370 ఆర్టికల్ తొలగించన తరువాత 70వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని జమ్ము కాశ్మీర్ రాష్ట్రం తొలిసారి 26 నవంబర్ 2020న నిర్వహించుకొనుటకు ఉత్సాహపడుతున్నది. భారత రాజ్యాంగం సూచించిన బాధ్యతలను నిర్వహించిన వారే హక్కులను అనుభవించుటకు అర్హులు మరియు అసలైన దేశభక్తులని తెలుసుకుందాం. ఏ విషమ పరిస్థితిలోనైనా రాజ్యాంగ పరిధి దాటరాదు.

రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతాలు:

ప్రస్తుత సమాజంలో నెలకొన్న అరాచకాలు, అక్రమాలు, అన్యాయాలు, ఆర్థిక అసమానతలు, కులమత వివక్షలు, హత్యారాజకీయాలు, నేర చరిత్రగల సభ్యులు చట్టసభల్లో ప్రవేశాలు, అవినీతి రాజ్యమేలే కార్యాలయాలు, అక్రమార్జనలు లాంటి అనేక అవలక్షణాలు రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతాలుగా, దేశాభివృద్ధికి శరాఘాతాలుగా మరియు శాంతి భద్రతలను అవరోధాలుగా నిలుస్తుండటం అతి విచారకరం. ప్రజాప్రతినిధుల లంచావతారాలు, రోజుల్లో కోట్లు గడించడాలు బహిరంగ రహస్యం అయిన రోజుల్లో అవినీతి అధికారుల బాబోతాలు అగ్నికి ఆజ్యం పోస్తున్నాయి. చివరికి న్యాయవ్యవస్థ కూడా అవినీతి ఆరోపణలతో సతమతమవుతున్న రోజుల్లో రాజ్యాంగ స్ఫూర్తి నేతిబీరలో నెయ్యి అయ్యిందని బాధ్యతగల పౌరులు బాధపడుతున్న కాలమిది. అవినీతి అంతటా కోవిడ్-19 అంటువ్యాధిలా వ్యాపించక ముందే భారతావని భాగ్యాన్ని తిరిగి లిఖిద్దాం. మనిషికి ప్రాణవాయువు ఎంత ముఖ్యమో రాజ్యానికి రాజ్యాంగం కూడా అంతే ప్రధానమని తెలుసుకొని పదిల పరుచుకుందాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# మంత్రి నిరంజన్ రెడ్డికి సన్మానం



ఖమ్మం, నవంబర్ 25: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మంజిల్లా రఘునాధపాలెం మండలం జింకల తండా రోడ్ లో నూతనంగా నిర్మించిన వేర్ హౌసింగ్ గోడౌన్ ప్రారంభించడానికి రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తో కలిసి ఖమ్మం విచ్చేసిన వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికిన టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఖమ్మం సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, నల్లమల్ల వెంకటేశ్వర్లు, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి రుద్రాక్షల మల్లేశం, తదితరులు ఉన్నారు.

# డీ కోటకొండ గ్రామంలోని సమస్యను పరిష్కరిస్తా : మంత్రి గుమ్మనూరు జయరాం

అమరావతి: నవంబర్ 25: ఆస్పరి మండల పరిధిలోని డీ కోటకొండ గ్రామానికి డ్రైనేజీ సమస్య, రోడ్డు సమస్యకు రూ.10 లక్షలు, బి పత్తికొండ గ్రామానికి రూ.5 లక్షలు, గార్లపెంట గ్రామానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం తెలియజేశారు. శుక్రవారం డీ కోటకొండ గ్రామంలో గడపగడపకు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి గుమ్మనూరు జయరాం, వైఎస్ఆర్పీపీ ఆలూరు తాలుక ఇన్ చార్జి గుమ్మనూరు నారాయణ స్వామి పాల్గొన్నారు. గ్రామ సచివాలయంలో అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. చిన్న పిండేకల్ నుండి డి కోటకొండ ఈ గ్రామానికి తారు రోడ్డు వేయడానికి రూ.42.51లక్షలు టెండర్ కూడా అయిపోయిందని, ఈ గ్రామానికి ప్రభుత్వ పథకాలకు రూ.4,55,92,383 ఖర్చు చేసిందని ఈ గ్రామంలో అన్ని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్పీపీ నాయకులు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఈనెల 26, 27 న తిరిగి డిసెంబర్ 3 ,4 తేదీలలో ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం

మెదక్, నవంబర్ 25: నేటినిజం ప్రతినిధి):ఈనెల 26, 27 న తిరిగి డిసెంబర్ 3 ,4 తేదీలలో ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహించవలసినదిగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుండి నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ లో జిల్లా కాలేసి తొర్లను ఉద్దేశించి మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సవరణ -2023 లో భాగంగా ఈ నెల 26, 27 తిరిగి డిసెంబర్ 3, 4 తేదీలలో నిర్వహించే ప్రత్యేక క్యాంపేయిన్ లో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క యువత ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి బూతు స్థాయి అధికారి సంబంధిత పోలింగ్ కేంద్రానికి ఉదయం 10:00 గంటలకు తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలన్నారు జనవరి 1, 2023 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువత ను గుర్తించి ఫారం -6 ద్వారా ఓటరు గా నమోదు చేయాలని ఇందుకు గాను బిఎల్ఓ లు ఇంటింటికి తిరిగి 18 సంవత్సరాలు నిండిన వారిని గుర్తించాలని సూచించారు. అదేవిధంగా ట్రాన్స్ జెండర్స్ ను గుర్తించి వారిని సైతం ఓటరు జాబితాలో నమోదు చేయాలని అన్నారు. అదేవిధంగా అంగవైకల్యం ఉన్న ఓటర్లను గుర్తించి సదరం డేటా ద్వారా వారిని ఓటర్ జాబితాలో నమోదు చేయాలని అన్నారు. ఇంతకు ముందు జాబితాలో ఉన్న వారిని, కొత్తగా నమోదు అయిన వారిని సైతం మ్యాపింగ్ చేయాలని సూచించారు. ఓటరు జాబితాలో ప్రముఖుల పేర్లు తప్పిపోకుండా చూసుకోవాలని , ఒకవేళ లేనట్లయితే వారి పేర్లు నమోదు చేయాలని వికాస్ రాజ్ తెలిపారు. ఫామ్ -6 ద్వారా ఓటర్ నమోదు, 6-ఆ ద్వారా ఆధార్ లింక్, ఫామ్ -7 ద్వారా చనిపోయిన వారిని తొలగించడం, ఫామ్ - 8 ద్వారా చిరునామా బదిలీ తదితర మార్పులు చేపట్టెందుకు ఫారాలు, బ్యానర్ తన వెంట పోలింగ్ స్టేషన్ వద్ద అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ రేఖాంక్షలు, (లాంగిట్యూడ్) మరియు అక్షంశాలు (లాటిట్యూడ్స్) గా తప్పనిసరిగా క్యాప్చర్ చేయాలని, సూపర్వైజర్లు ఈ విషయాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. ప్రతి సూపర్వైజర్ వారి పరిధిలో కనీసం 10 శాతం పోలింగ్ కేంద్రాలను సందర్శించి ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలని,అలాగే ఈఆర్ఓ వారి పరిధిలో ఉన్న 10 పోలింగ్ కేంద్రాలను సందర్శించి అన్ని అంశాలను పరిశీలించి అర్హత ఉన్న వారందరూ ఓటరు జాబితాలో నమోదైనది లేనిది పరిశీలించి జిల్లా ఎన్నికల అధికారికి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అనంతరం తహసీల్దార్లు, సూపెర్వైజర్లు, సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ రమేష్ మాట్లాడుతూ ప్రతి బూతు స్థాయి అధికారి సంబంధిత పోలింగ్ కేంద్రానికి ఉదయం 10 గంటలకు తప్పనిసరిగా హాజరై సాయంత్రం 5 వరకు ఉండాలని అన్నారు. గ్రామ పంచాయతీలో టామ్ టామ్ ద్వారా ప్రచారం చేయాలని డి.పి.ఓ. కు, అంగన్వాడీ కార్యకర్తలు అందుబాటులో ఉండేలా చూడాలని జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారికి సూచించారు. 18 ఏళ్ళు నిండిన ప్రతి యువత ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని అన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు, సూపర్వైజర్లు , బూత్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గోడౌన్ ప్రారంభించిన మంత్రులు పువ్వాడ, నిరంజన్ రెడ్డి



ఖమ్మం, నవంబర్ 25: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం నియోజకవర్గం రఘునాధపాలెం మండలం జింకల తండా వద్ద రూ.14.90 కోట్లతో నూతనంగా నిర్మించిన 20 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల మూడు గోదాములను ప్రారంభించిన రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు.

అనంతరం మంత్రి పువ్వాడ మాట్లడుతూ..నాటి ఉమ్మడి రాష్ట్రంలో పండించిన పంటను రైతులు దాచుకునే వెసులుబాటులో లేకుండా పోయిందని, దానికి శాశ్వత పరిష్కారం చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఅర్ ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. ఖమ్మం జిల్లా వైవిద్యమైన వ్యవసాయం చేయడంలో ఖమ్మం జిల్లా ముందుందన్నారు.

ముఖ్యమంత్రి కేసీఅర్ ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్, ఎరువులు, విత్తనాలు సరఫరాతో ఖమ్మం జిల్లాలో ప్రతి పంటను రైతులు స్వేచ్ఛగా పండిస్తున్నారని, ప్రతి ఏడాది ఆయా పంటల దిగిమతి సంఖ్య గణనీయంగా పెరిగిపోతుందన్నారు. వ్యవసాయం చేస్తూనే రైతులు రైతులు ఆనందం పొందుతారని అన్నారు.

జిల్లా వ్యాప్తంగా రైతులు పత్తిని అద్భుతం పండిస్తున్నారు. ఖమ్మం జిల్లా నుండి అత్యధికంగా పండిస్తున్న వారిలో జిల్లా ముందంజలో ఉ ందన్నారు. వ్యవసాయం చెయ్యాలంటే విద్యుత్ ఎప్పుడు వస్తాడో.. ఎప్పుడు ఉంటదో ఆయా అధికారులకే తెలియదన్నారు.

కానీ నేడు నిరంతర ఉచిత విద్యుత్ ను అందిస్తూ వ్యవసాయ రంగాన్ని నడిపిస్తున్నారని అన్నారు. నాడు పొలాల్లో ఒక్క ట్రాన్స్ఫార్మర్ కలిపితే మళ్ళీ అక్కడ మరొక ట్రాన్స్ఫార్మర్ రావాలంటే ఆ గోస రైతులకే తెలుసన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా బీడు భూములన్ని పచ్చరంగు పులుముకున్నాయన్నారు. రైతును రాజు చేయాలనే ఉద్దేశ్యంతో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో రైతులకు ఉచిత విద్యుత్, రైతు బంధు, రైతు బీమా, చెక్ డ్యాముల నిర్మాణం, మినీ లిఫ్టులతో మిర్రు ప్రాంతాలకు సాగునీరును అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని రైతుల సంక్షేమం పట్ల తెలంగాణ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. రైతులు మార్కెట్ లో డిమాండ్ ఉన్న పంటలను పండించడం ద్వారా లాభసాటి వ్యవసాయం చేయాలని అన్నారు. సాగునీరు అందించడంతో రైతులు, గ్రామస్తులు వ్యవసాయ పనులలో నిమగ్నమై గ్రామంలో సమావేశాలకు, సభలకు వచ్చే పరిస్థితి లేదన్నారు. మానవ జీవన మనుగడకు నీరే మూలాధారమని.. నీటిని ఒడిసిపట్టే పనులకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో గిడ్డింగుల సంస్థ చైర్మన్ సాయి చంద్, కలెక్టర్ గౌతమ్, జడ్పీ చైర్మన్ కమల్ రాజు, డిసిసిబి చైర్మన్ నాగభూషణం, డీసీఎంఎస్ చైర్మన్ శేషగిరి రావు, మేయర్ నీరజ, సుడా చైర్మన్ విజయ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీ ప్రసన్న, ఎంపీపీ గౌరీ, జడ్పీటీసీ ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో రూ.573.13 కోట్ల విలువైన ప్రాజెక్టులను ఆమోదించిన శ్రీ నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ, నవంబర్ 25:తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లాలోని ఎన్‌హెచ్-163లో ఉన్న హైదరాబాద్-భూపాలపట్నం సెక్షన్‌లో ఇప్పటికే ఉన్న 2 వరుసల రహదారిని మరింత విస్తరించడానికి ఆమోదం తెలిపినట్లు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ వరుస ట్వీట్‌ల ద్వారా వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ మొత్తం వ్యయం రూ.136.22 కోట్లు. ప్రధాన పర్యాటక ప్రాంతాలైన లక్నవరం సరస్సు, బొగత జలపాతాలను కలుపుతూ రహదారి విస్తరణ ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ, చత్తీష్‌గఢ్ మధ్య అంతర్రాష్ట్ర అనుసంధానాన్ని కూడా మెరుగుపరుస్తుందని వెల్లడించారు. ములుగు జిల్లా మావోయిస్టు కార్యకలాల (ఎల్‌డబ్ల్యూఈ) ప్రభావిత జిల్లా అని, రహదారి విస్తరణ వల్ల ఆయా కార్యకలాపాలను నియంత్రించడానికి ప్రభుత్వానికి వీలు కలుగుతుందని మంత్రి చెప్పారు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ను కలుపుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో కృష్ణా నదిపై ఐకానిక్ వంతెన అప్రోచ్ సహా, ఎన్‌హెచ్-167కేలో 2/4 వరుసల రోడ్డుకు సంబంధించిన పునరావాసం, విస్తరణకు ఈపీసీ పద్ధతిలో ఆమోదం లభించిందని శ్రీ గడ్కరీ చెప్పారు. ఈ ప్రాజెక్ట్ వ్యయం రూ.436.91 కోట్లు. ఎన్‌హెచ్-167కే వల్ల హైదరాబాద్/కల్వకుర్తి ఉ తిరుపతి, నంద్యాల/చెన్నై వంటి నగరాలకు చేరే ప్రయాణం దాదాపు 80 కి.మీలు తగ్గిస్తుందని అన్నారు. ప్రస్తుతం ఎన్‌హెచ్-44 మీద వెళ్తున్న వాహనాలు, విస్తరణ పూర్తయిన తర్వాత ఔఉ-167కే మారతాయని వెల్లడించారు. నల్లమల అడవులకు సమీపంలో ఉన్న నంద్యాల, వ్యవసాయ ఉత్పత్తులు ఉ అటవీ ఉత్పత్తులకు ముఖ్యమైన వాణిజ్య కేంద్రంగా అని చెప్పారు. కొల్లాపూర్ వద్ద నిర్మాణం కోసం మంజూరైన ఐకానిక్ వంతెన రెండు రాష్ట్రాలకు ముఖద్వారం అవుతుందని, పర్యాటకాన్ని ప్రోత్సహిస్తుందని ట్వీట్ ద్వారా శ్రీ గడ్కరీ వెల్లడించారు.

# యంగ్ ఫైర్సోనిస్టులు నా బాల్యం నుంచి స్ఫూర్తి పొందారు: దర్శకుడు షీలా పై

న్యూఢిల్లీ, నవంబర్ 25:కెనడాలోని ఒక ఒంటరి వ్యవసాయ కమ్యూనిటీ చిన్న ప్రకృతి దృశ్యం మధ్య సెట్ చేయబడింది, నలుగురు కౌమార బాలికలు నిర్జన జీవితాలను తప్పించుకోవడానికి కలిసి ఉంటారు.

ఒక పాడుబడిన ఫామ్ హౌస్ ను తమ స్వంత ఫామ్ హౌస్ గా తిరిగి పొందడం ద్వారా, వారు ప్రగాఢ బంధాన్ని ఏర్పరుస్తారు, అది వారి అంతరంగిక భయాలు ,కోరికలు వారి ఏకైక సురక్షితమైన స్థలాన్ని నాశనం చేసే చీకటి ప్రదేశానికి దారి తీస్తుంది. 53వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా 'వరల్డ్ ఆఫ్ సినిమా' విభాగంలో ప్రదర్శించబడిన కెనడియన్ విజువల్ ఆర్టిస్ట్ షీలా పై దర్శకత్వం వహించిన ది యంగ్ ఆర్సోనిస్ట్ చిత్రం ఈ అమ్మాయిలు తమ నిరాశను సామూహిక పునర్జన్మగా వ్యక్తీకరించే మార్గాల గురించి ఒక సంగ్రహావలోకనం ఇస్తుంది. ఐఎఫ్ఎఫ్ఐ 53లో పిఐబి నిర్వహించిన మీడియా ప్రతినిధుల ఇంటరాక్షన్ లో

షీలా పై మాట్లాడుతూ, ఈ కథ తన బాల్యం నుండి చాలా ప్రేరణను పొందిందని, చాలా పాత్రలు తన జీవితంలో తనకు తెలిసిన నిజమైన వ్యక్తుల నుండి వచ్చాయని అన్నారు.

ఈ చిత్రంలో ఉపయోగించిన పాడుబడిన ఫామ్ హౌస్ చిత్రాల గురించి షీలా పై మాట్లాడుతూ, చిన్నతనంలో తనకు గ్రామీణ ప్రాంత శిధిల గృహాల పై ఆసక్తి ఉండేదని చెప్పారు. "నేను భయం, ఉత్సాహం, ఆశ్చర్యం , విషయాలను అన్వేషించడం వంటి అనుభూతిని అనుభవించడానికి ఇష్టపడతాను. నా మొదటి షార్ట్ ఫిల్మ్ నా 18 సంవత్సరాల వయస్సులో తీశాను. నేను చిత్రీకరణ కోసం ట్రైపాడ్ తో ఒక పాడుబడిన ఇంట్లోకి ప్రవేశించాను. ఇలాంటి అనుభవాలు నా సినిమాలకు అచేతన ప్రేరణకు ఎంతగానో దోహదం చేసేవి" అని ఆమె అన్నారు.

తన దృశ్య కళాకృతిలో చాలా భాగం ఖచ్చితంగా కెనడియన్ గోతిక్ సాహిత్యం నుండి ప్రేరణ పొందిందని కూడా షీలా పై అంగీకరించారు. ఈ శైలి ప్రవృత్తి ద్వారా తన చిత్రాలలోకి ప్రవేశించి ఉండవచ్చని ఆమె అన్నారు. ప్రధాన పాత్రధారుల జీవితంలో ఆర్థిక వాస్తవాలు ఖచ్చితంగా ఒక భాగమని ఆమె పలు ప్రశ్నలకు సమాధానంగా చెప్పారు.

తమ జీవితంలోని అసంఖ్యాకమైన సమస్యల నుంచి ఫామ్ హౌస్ కు పారిపోయే అమ్మాయి పాత్రలు తమ భారాల నుంచి తప్పించుకోలేనట్లుగా సంఘర్షణలతో వెంటాడతాయి. చివరికి 'యువ దహనకారులు' వారు అక్కడ భ్రష్టుపట్టినట్లుగా భావించిన సురక్షితమైన ఇంటికి కూడా నిప్పు పెట్టారు. ప్రాపంచిక జీవితంలో ఇంకొంచెం ఎక్కువ ఆశ లేదా ఆశావాదానికి ఆస్కారం లేదా? బాగా, చిత్రంలో ఉపయోగించిన అగ్ని దృశ్య రూపకం ఒక విధ్వంసక శక్తి కాదు, కానీ అధిక భారం ఇంకా విచారకరమైన జీవితాన్ని శుద్ధి చేసే ఒక అంశం అని

షీలా పై అన్నారు. "కథానాయకుడు చివరికి ఇంటిని తగలబెట్టినప్పుడు, నేను దానిని ప్రతికూల విషయంగా చూపించాలని అనుకోలేదు, కానీ సానుకూల విషయం. ఆమె చివరకు స్వేచ్ఛను కనుగొంది, వాస్తవికతను ఎదుర్కొంటుంది . ముందుకు సాగడానికి సిద్ధంగా ఉంది. జీవితం అవసరమైన వ్యత్యాసాలతో నిండి ఉంది. నా చిత్రానికి తప్పనిసరిగా సంతోషకరమైన లేదా విచారకరమైన ముగింపు ఉండాలని నేను కోరుకోను. నేను చాలా ఆశలను చూశాను" అని ఆమె వివరించింది.

విజువల్ ఆర్ట్స్ పై ప్రావీణ్యాన్ని సినిమాలోకి తీసుకువచ్చారా? అన్న ప్రశ్నకు షీలా పై బదులిస్తూ, స్క్రిప్ట్ రాయడానికి ముందు కూడా ఆమె తన ప్రధాన లక్షణాలను నిర్దిష్ట రంగుగా కేటాయించింది- ఒక అమ్మాయి ఎరుపు, ఒక అమ్మాయి పసుపు, ఒక అమ్మాయి నీలం , ఒక అమ్మాయి ఆకుపచ్చ. అమ్మాయిలను అన్వేషించడం ప్రారంభించడం నా సూత్రంగా మారింది అని వివరించారు. షార్ట్ ఫిలిమ్స్ నుండి ఫీచర్ ఫిల్మ్ కు మార్పు గురించి ఆమె మాట్లాడుతూ, ఈ ప్రక్రియ ఆసక్తికరంగా, సవాలుగా నమ్మశక్యం కానిదిగా ఉందని అన్నారు.

ఐఎఫ్ ఎఫ్ ఐ తర్వాత కైరో ఫిల్మ్ ఫెస్టివల్ లో యంగ్ ఆర్సోనిస్ట్స్ ను ప్రదర్శిస్తామని ఈ చిత్ర నిర్మాత అగాథా డెల్సోర్బో తెలియజేశారు.

ఐఎఫ్ఎఫ్ఐ 53 లో ఆసియా ప్రీమియర్ ను కలిగి ఉన్న యంగ్ ఆర్సోనిస్ట్స్ గతంలో టొరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ 2022 లో ప్రపంచ ప్రీమియర్ ను కలిగి ఉంది.

1980 దశకం లో గ్రామీణ కెనడాలో సెట్ చేయబడింది, దర్శకురాలు దృశ్య కళాకారిణి షీలా పై వెంటాడే ఫీచర్ అరంగేట్రం టీనేజ్ అమ్మాయిల సమూహాన్ని అనుసరిస్తుంది - ప్రతి ఒక్కరూ కుటుంబ గాయం ఏదో ఒక రూపాన్ని అనుభవిస్తున్నారు - వారి సంబంధాలు ఒకదానితో మరొకటి బలపడతాయి .

షీలా పై అంతర్జాతీయంగా ప్రశంసలు పొందిన దృశ్య కళాకారిణి. ఆమె లఘు చిత్రాలు లోకార్నో , టిఐఎఫ్ఎఫ్ లతో సహా ప్రతిష్టాత్మక ఉత్సవాలలో ప్రదర్శించబడ్డాయి. ఆమె షార్ట్ ఫిల్మ్, 'ది రెడ్ వర్జిన్' 2011లో టిఐఎఫ్ఎఫ్ లో ప్రదర్శించబడింది. స్పెయిన్ లో జరిగిన వల్లాడోలిడ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ లో నైట్ ఆఫ్ ది స్పానిష్ షార్ట్ ఫిల్మ్ అవార్డును గెలుచుకుంది.

# 18%శాతం పెరుగుదలతో అక్టోబర్ నాటికి 448 మిలియన్ టన్నులకు చేరుకున్న బొగ్గు ఉత్పత్తి



న్యూఢిల్లీ, నవంబర్ 25: దేశంలో మొత్తం బొగ్గు ఉత్పత్తి అక్టోబర్ 2022 నాటికి 448 మిలియన్ టన్నులు (ఎంటి)గా ఉంది. ఇది గత ఏడాది ఇదే కాలానికి చెసిన ఉత్పత్తికన్నా 18% ఎక్కువ. కోల్ ఇండియా లిమిటెడ్ (సిఐఎల్) నుంచి బొగ్గు ఉత్పత్తి వృద్ధి కూడా 17% కన్నా ఎక్కువగా ఉంది. దేశీయ బొగ్గు ఆధారిత ప్లాంట్లకు నవంబర్ 2020 చివరి నాటికి 30 మిలియన్ టన్నుల బొగ్గు స్టాక్‌ను సమకూర్చాలని బొగ్గు మంత్రిత్వ శాఖ ప్రణాళికలు వేస్తోంది. ఈ స్టాక్‌ను సమకూర్చే ప్రక్రియను కొనసాగించాలని, తద్వారా 31 మార్చి 2023 నాటికి థర్మల్ పవర్ ప్లాంట్ల (టిపిపి) స్టాకు 45 మిలియన్ టన్నులకు చేరుకుంటుందని శాఖ ప్రణాళికలు వేస్తోంది. గనులలో (జూతిబిష్ట్రవజీట) బొగ్గు స్టాక్‌ను పెంచేందుకు ప్రణాళికలు కూడా వేస్తోంది.

ఈ ఏడాది మొదటి ఏడునెలలో, రోజువారి రేక్‌ల సౌలభ్యంలో 9% సగటు వృద్ధి కావడమన్నది పవర్ ప్లాంట్ల వద్ద స్టాక్‌లను సమకూర్చేందుకు ఎక్కువ పరిణామంలో బొగ్గును రవాణా చేయడానికి తోడ్పడుతోంది. ఇంధన మంత్రిత్వ శాఖ కూడా రైల్ కమ్ రోడ్డు మాధ్యమం ద్వారా బొగ్గు రవాణాను పెంచుతోంది. రానున్న ఎనిమిది నెలలకు విద్యుత్ ఉత్పత్తి చేసే కంపెనీలు అన్నింటికీ ఆర్‌సిఆర్ మాధ్యమం ద్వారా రవాణా చేసే కోటా గురించి సిఐఎల్ సమాచారాన్ని ఇచ్చింది. ఇది విద్యుత్ ఉత్పత్తి కంపెనీలు తమ రవాణా వ్యూహాన్ని ముందస్తుగా రూపొందించుకునేందుకు తోడ్పడుతుంది.

ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ, ఇంధన, రైల్వేలు, బొగ్గు మంత్రిత్వ శాఖలు బొగ్గును సముద్రమార్గం ద్వారా రవాణా చేసేందుకు కలిసి పని చేస్తున్నాయి. ఇప్పటివరకూ ఎంసిఎల్ నుంచి పరదీప్ వరకు బొగ్గును రైలు మార్గం ద్వారా, ఆపైన తూర్పు తీరాన ఉన్న విద్యుత్ ప్లాంట్లకు రైలు- సముద్రం-రైలు మార్గం ద్వారా రవాణా చేస్తున్నారు. దేశంలోని తూర్పు ప్రాంతంలో ఉన్న బొగ్గు గనుల నుంచి బొగ్గును పశ్చిమ తీరానికి లేదా ఉత్తర ప్రాంతాలకు రవాణా చేయడాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందుకు అనుగుణంగానే పరదీప్‌కు రవాణా చేసే బొగ్గు సామర్థ్యాన్ని పెంచడం జరిగింది. వచ్చే ఏడాది తొలి నెలలల్లో పశ్చిమ తీరంలో ఉన్న ప్లాంట్లకు బొగ్గును చేరవేసే పనిని ప్రారంభించేందుకు ప్రణాళికలు వేస్తున్నారు. సాధ్యమయ్యే మూడు మాధ్యమాల ద్వారా బొగ్గును రవాణా చేయడాన్ని ప్రోత్సహించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

ఉత్పత్తి, రవాణా, దేశీయ బొగ్గు నాణ్యత అంశాలను బొగ్గు మంత్రిత్వ సన్నిహితంగా పర్యవేక్షిస్తోంది.




# ఆయిల్‌పామ్‌లో ఏపీ టాప్.. బెస్ట్ పెర్మార్మెన్స్ ఇన్ ఇండియా అవార్డు

అమరావతి: నవంబర్ 25:ఆయిల్‌పామ్ సాగులో ఏపీ దూసుకువెళుతోంది. సాగు, దిగుబడి, విస్తరణలో దేశంలోనే ప్రథమస్థానంలో నిలుస్తోంది. విజయవాడ సమీపంలోని పోరంకిలో నిర్వహిస్తున్న ఆయిల్ పామ్ జాతీయ సదస్సులో ఏపీకి బెస్ట్ పెర్మార్మెన్స్ ఇన్ ఇండియా అవార్డు దక్కింది భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి మాజీ డిప్యూటీ డైరెక్టర్ హెచ్.పీ సింగ్, మలేషియా ఆయిల్ పామ్ డైరెక్టర్ జనరల్ అహ్మద్ పర్వేజ్ ఖాదీర్ తదితరులు జాతీయ సదస్సులో పాల్గొని ఏపీలో ఆయిల్ పామ్ కు ఉన్న అపార అవకాశాల గురించి రైతులతో పాటు ప్రాసెసింగ్ యూనిట్ల నిర్వాహకులు, ఇతర వాణిజ్యవేత్తలకు తెలియచెప్పారు. అధికారిక లెక్కల ప్రకారం దేశవ్యాప్తంగా 4 లక్షల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగవుతుంటే ఏపీ సాగు విస్తర్ణం 1.9 లక్షల హెక్టార్లుగా ఉంది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ రీసెర్చ్ గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా సుమారు 30 లక్షల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ చెందే అవకాశం ఉందని గుర్తించగా.. అందులో ఏపీ వాటా 40 శాతం మేర ఉండవచ్చని అంచనా. రాష్ట్రంలోని 12 ఇండస్ట్రియల్ జోన్లలో గంటకు 460 టన్నులను ప్రాసెసింగ్ చేసే యూనిట్లు ఉండటం ఆయిల్ పామ్ హబ్ గా ఏపీగా ఎదుగుతుందనటానికి సంకేతమని అధికారులు చెబుతున్నారు.

తూర్పుగోదావరి, గుంటూరు, కృష్ణా, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఆయిల్ పామ్ సాగుకు అనువైన వాతావరణం ఉందని గుర్తించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయిల్ పామ్ మిషన్ ఏపీలో సాగు విస్తరణకు ఊతమిస్తోంది. ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహకాల కింద ఆయిల్ పామ్ మిషన్‌ను అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తొలివిడతగా 104 కోట్ల రూపాయలను కేటాయించింది. ఆయిల్ పామ్ సాగులో ఎకరాకు సగటున 10 టన్నుల దిగుబడి వస్తుండగా ఇపుడున్న ధరల ప్రకారం రూ.2 లక్షల మేర లాభం వస్తున్నట్టు అంచనా. గత ఏడాది నవంబరులో మార్కెట్ సీజన్ ప్రారంభం కాగా ఫిబ్రవరి నుంచి ధరలు క్రమేపీ పెరుగుతూ టన్ను రూ.16 వేల నుంచి 23 వేలకు చేరింది. రాష్ట్రంలో సుమారు 1.9 లక్షల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగవుతోంది. గత ఏడాది 2021-22లో 17.22 లక్షల టన్నులు రాగా.. ఈ ఏడాది 2022-23లో 21 లక్షల టన్నులు రావచ్చని అంచనా. ఈ మేరకు ప్రాసెసింగ్ యూనిట్లను కూడా పెంచేలా ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతం గంటకు సుమారు 460 టన్నుల సామర్థంతో ఆయిల్ తీసే 13 పామాయిల్ పామాయిల్ కంపెనీలున్నాయి. పామాయిల్ సాగు ఎక్కువగా ఉన్న పశ్చిమ గోదావరి జిల్లాలో మరిన్ని ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పేందుకు పామాయిల్ కంపెనీలు ఉత్సాహం చూపిస్తున్నాయి.

## రైతులకు భారీ సబ్సిడీ

కేంద్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు విస్తరణ, దిగుబడి పెంపు కోసం రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రైతులకు ప్రోత్సాహకాలు అందించేందుకు నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ ? ఆయిల్ పామ్ (ఎన్.ఐ.ఎం.ఈ.వో-ఓపీ) పేరుతో దేశీయ మిషన్ ను ప్రకటించింది. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులు ప్రతికూల పరిస్థితులు ఏర్పడినా నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వం రూ 80 కోట్లతో ధరల కోసం స్థిరీకరణ నిధిని ఏర్పాటు- చేసింది. ఆయిల్ పామ్ సాగుకు అవసరమైన వేప చెక్క, ఇతర సేంద్రీయ ఎరువులను రైతు భరోసా కేంద్రాల కియోస్క్ బుకింగ్ ల ద్వారా సరఫరా చేయటం, ఆయిల్ ఫామ్ ఫార్మ్ గేటు-కు సమీపంలో ప్రాసెసింగ్ యూనిట్లు- నెలకొల్పటం, రైతులకు అవసరమైన మొక్కలను సరఫరా చేయటం, సన్న, చిన్న కారు రైతులను ఆయిల్ పామ్ సాగు వైపు దృష్టి మరల్చేలా ప్రోత్సాహకాలు పెంపొందించటం తదితర ప్రతిపాదనల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ చేపడుతోంది. కేంద్ర ప్రభుత్వం కూడా ఆయిల్ పామ్ ను జాతీయ వంట నూనెల మిషన్ (ఎన్ఎంఈవో)లో చేర్చటం ద్వారా భారీ రాయితీలు ప్రకటించింది.

ఉద్యానవనశాఖ నుంచి రైతులకు అందించే ప్రతి ఆయిల్ పామ్ మొక్కపై 85 శాతం సబ్సిడీని ప్రకటించింది. సబ్సిడీని జాతీయ ఆహార భద్రత మిషన్ నుంచి రైతులకు నేరుగా అందిస్తోంది. సాగుకు అవసరమైన వర్మీ కంపోస్ట్ యూనిట్లు, పంపు సెట్లు, గొట్టపు బావులతో పాటు ఇతర యంత్రాలు, పరికరాల కొనుగోలు కోసం 50 శాతం సబ్సిడీ అందిస్తోంది. అయిల్ పామ్ సాగుకు అనుబంధంగా అగ్రి ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పటం, డ్రిప్ ఇరిగేషన్ ప్రోత్సాహకాలు, పంట ధరలను హేతుబద్ధంగా నిర్ణయించేందుకు ఆయిల్ ఎక్స్ట్రాక్షన్ రేషియో (ఓఇఆర్) ను అనుసరించటం, ప్రతికూల పరిస్థితులు ఏర్పడినా నష్టపోకుండా నష్ట నివారణ నిధి (వయబులిటీ గ్యాప్ ఫండింగ్) ఏర్పాటు చేయటంపై కూడా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది.

# సీతారామన్ గారూ.. రూ.17,240 కోట్లు రిటర్న్ ఇచ్చేయండి

న్యూఢిల్లీ, నవంబర్ 25: కొత్త పెన్షన్ విధానం కింద నమోదు అయిన రాష్ట్ర ఉద్యోగులకు చెందిన సుమారు రూ.17000 కోట్లను రిఫండ్ చేయాలని చత్తీస్‌ఘడ్ సీఎం భూపేశ్ భగల్ ఇవాళ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. తమ ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం కోసం పాత పెన్షన్ స్కీమ్‌ను రిస్టోర్ చేసినట్లు ఆయన వెల్లడించారు. నేషనల్ సెక్యూర్టీస్ డిపాజిటరీ లిమిటెడ్ సంస్థ వద్ద మార్చి 31 వరకు సుమారు 17240 కోట్లు డిపాజిట్ అయ్యాయని, ఆ మొత్తాన్ని తిరిగిస్తే వాటిని జనరల్ ప్రావిడెంట్ ఫండ్‌లో కలుపుతామని ఆయన తెలిపారు. రాష్ట్రానికి రావాల్సిన జీఎస్టీ పరిహారాన్ని, బొగ్గు కంపెనీలపై విధించిన అదనపు పన్నును కూడా ఇవ్వాలని సీఎం భగల్ డిమాండ్ చేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో జరిగిన ప్రీ బడ్జెట్ సమావేశంలో ఆయన ఈ డిమాండ్ చేశారు.







# స్పర్శ ద్వారా తల్లీ బిడ్డల మధ్య కలిగే అనుబంధాన్ని కళ్లకు చూపించే 'లోటస్ బ్లూమ్స్'

న్యూఢిల్లీ, నవంబర్ 25:ప్రతి వ్యక్తి జీవితంలో ప్రకృతి మరియు వ్యక్తుల మధ్య ముడిపడి ఉండే భావోద్వేగ సంబంధాలు ప్రధాన ఇతివృత్తంగా మైథిలి భాషలో 'లోటస్ బ్లూమ్స్' రూపుదిద్దుకుంది. భావోద్వేగ సంబంధాలను ప్రేరణగా తీసుకుని చిత్రాన్ని నిర్మించామని దర్శకుడు ప్రతీక్ శర్మ తెలిపారు. ఈ సందేశాన్ని వినోదాత్మకంగా 'లోటస్ బ్లూమ్స్' చిత్రం ద్వారా తెరకెక్కించామని ఆయన అన్నారు. భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో పీఐబీ ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో 'లోటస్ బ్లూమ్స్' బృందం పాల్గొని తమ అభిప్రాయాలు తెలిపారు. ఒక వ్యక్తి సిద్ధం చేసుకున్న ప్రణాళిక విఫలం అయ్యే ప్రమాదం ఉందని అయితే విశ్వంలో మనకు రాసి ఉన్నది మనకు చేరుతుంది అని స్క్రీన్‌ప్లే రచయిత అస్మిత శర్మ అన్నారు. అనుకోని విధంగా కొంత ఆలస్యంగా అయినా విశ్వంలో మనకు రాసి ఉన్నది మనకు చేరుతుంది అని అన్నారు. "కొన్నిసార్లు జీవిత ప్రయాణం దుర్భరంగా మారుతుంది. ఈ సమయంలో ప్రకృతి మరియు సర్వశక్తిమంతుడు అయిన అంతర్యామిని నమ్మి నమ్మకం ఉంచితే సమస్యలు అద్భుత మార్గాల్లో పరిష్కారం అవుతాయి" అని అస్మిత శర్మ అన్నారు.

మాట్లాడుతూ, "సందేశాన్ని వ్యక్తీకరించడానికి 'సినిమా భాష' లో సందేశాన్ని వినిపించే విధంగా రూపొందడంతో దీనిలో నటించడానికి అంగీకరించాను" అని ప్రముఖ నటుడు అఖిలేంద్ర ఛత్రపతి మిశ్రా అన్నారు. "జీవితం కూడా కమలం లాంటిదని, ఇది సూర్యోదయంతో వికసిస్తుంది మరియు సూర్యాస్తమయంతో ఎండిపోతుంది" అన్న ఇతివృత్తంతో సినిమా రూపొందింది" అని ఆయన చెప్పారు. మైథిలి భాషకు ప్రాచుర్యం కల్పించడం సినిమా ముఖ్య ఉద్దేశమని అన్నారు. భారతదేశ గొప్పదనం ప్రాంతీయ భాషా చిత్రాల ద్వారా ఎక్కువగా తెలుస్తుందని అన్నారు. ప్రాంతీయ భాషల్లో సినిమాలు ఎక్కువగా రావడం లేదన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. ప్రాంతీయ భాషల్లో సినిమాలు ఎక్కువగా రావాలని అఖిలేంద్ర ఛత్రపతి మిశ్రా ఆకాంక్షించారు. జీవితం కంటే సినిమా పెద్దదని పేర్కొన్న అఖిలేంద్ర ఛత్రపతి మిశ్రా జీవితానికి సినిమా పొడిగింపు అని అన్నారు. నవరసాలు ఉండే సినిమా సంస్కృతి, భాష మరియు ఆధ్యాత్మిక దృష్టి కలిగి ఉంటుందని ఆయన అన్నారు.

అఖిలేంద్ర ఛత్రపతి మిశ్రా ప్రస్తావించిన దర్శకుడు ప్రతీక్ శర్మ "సినిమా అనేది వ్యాపార వస్తువు కాదు. ప్రేక్షకుల భావోద్వేగాలకు సంబంధించినది" అని అన్నారు. ప్రతీక్ శర్మ సామాజిక ప్రాధాన్యత కలిగిన సినిమాలు తీయడంలో పేరు తెచ్చుకున్నాడు. సినిమాల ద్వారా సమాజానికి కొంత తిరిగి ఇవ్వాలని ప్రయత్నిస్తున్నాను అని శర్మ అన్నారు.

దర్శకుడు ప్రతీక్ శర్మ, నిర్మాత మరియు స్క్రీన్‌ప్లే రచయిత అస్మితా శర్మ, నటుడు అఖిలేంద్ర ఛత్రపతి మిశ్రా మరియు మాస్టర్ అథ్ శర్మ తో పాటు 'లోటస్ బ్లూమ్స్' చిత్రం నటీనటులు మరియు సిబ్బందిని నవంబర్ 23, 2022న భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో సన్మానించారు. సత్కరించారు.

మైథిలీ భాషలో నిర్మించిన 'లోటస్ బ్లూమ్స్ ' చిత్రాన్ని 53 వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం ఇండియన్ పనోరమా విభాగంలో ప్రదర్శించబడింది. తల్లి మరియు బిడ్డల మధ్య స్పర్శ ద్వారా కలిగే బంధం ఆధారంగా తయారైన కథ ఆధారంగా సినిమా నిర్మాణం జరిగింది.సినిమాలో చాలా తక్కువ సంభాషణలు ఉన్నాయి. బీహార్‌లోని మారుమూల ప్రాంతాల్లో చిత్రాన్ని చిత్రీకరించారు.

ప్రకృతి, మానవుల్లో ఉండే మానవత్వం దీనికి సంబంధించిన విశ్వాసం తెలియజేసే విధంగా 'లోటస్ బ్లూమ్స్' చిత్ర నిర్మాణం జరిగింది. మనస్సాక్షి అనే కమలం ప్రకృతి మాత, అంతర్గత స్వభావంతో ఆత్మతో అనుసంధానం అయినప్పుడు మాత్రమే వికసిస్తుంది. కథానాయిక (సరస్వతి) ప్రేమతో నిండిన మాతృమూర్తి ప్రకృతికి ప్రతీకగా చిత్రంలో కనిపిస్తుంది. ప్రేమానుబంధాలు అందించే అత్యద్భుతమైన శక్తి మాతృమూర్తికి మాత్రమే ఉంటుంది. సమాజం నుంచి ఎదురయ్యే సమస్యలు మాతృమూర్తిని దూరం చేయవు.

# ఎ.ఎం.ఆర్. ఒక నిశ్శబ్ద, అదృశ్య మహమ్మారి!



న్యూఢిల్లీ, నవంబర్ 25:'యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఎం.ఎం.ఆర్.) అనేది నిశ్శబ్దంగా దెబ్బతీసే, అదృశ్య మహమ్మారి, ఇతర సాధారణ ప్రజారోగ్య ప్రాధాన్యతా కార్యక్రమాలతో దీన్ని అధిగమించడం సాధ్యం కాదు" అని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతీ ప్రవీణ్ పవార్ అన్నారు. ఎం.ఎం.ఆర్. మహమ్మారి బెడదపై ఈరోజు జరిగిన 3వ అత్యున్నత స్థాయి ప్రపంచ సదస్సుకు సంబంధించిన మంత్రిత్వ శాఖ ప్లీనరీ ప్యానెల్ భేటీలో ఆవె ప్రసంగించారు. ఒమన్‌లోని మస్కట్‌లో ఏర్పాటు చేసిన ఈ సదస్సులో 15కుపైగా దేశాలకు చెందిన 22మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎ.ఎం.ఆర్.పై బహుళ భాగస్వామ్య వర్గాల ప్రమేయంతో కూడిన ఒక వేదికను నాలుగు ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సంస్థలు ప్రారంభిం చాయి.

ఎ.ఎం.ఆర్. మహమ్మారి ప్రాబల్యం, దాని తదుపరి ప్రాణాంతక ప్రభావాలను గురించి కేంద్రమంత్రి తన ప్రసంగంలో ప్రధానంగా ప్రస్తావించారు. ఆరోగ్యానికి ప్రపంచ స్థాయిలో ఎదురైన ముప్పుగా ఎ.ఎం.ఆర్.ను ఇప్పటికే గుర్తించినట్లు ఆవె చెప్పారు. ఎ.ఎం.ఆర్. మహమ్మారితో తీవ్రమైన ఆరోగ్య సమస్యలు, ఆర్థిక, రాజకీయ పర్యవసానాలు ఎదురవుతున్నాయని అన్నారు.

ఎ.ఎం.ఆర్. నిరోధంపై దృష్టి సారించినందుకు ఐక్యరాజ్యసమితి (యు.ఎన్.) సర్వప్రతినిధి సభకు, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు.హెచ్.ఒ.కు), సభ్యదేశాలకు కేంద్రమంత్రి డాక్టర్ పవార్ అభినందనలు తెలిపారు. "ఎ.ఎం.ఆర్. సమస్యకు యు.ఎన్. సర్వప్రతినిధి సభ, డబ్ల్యు.హెచ్.ఒ., సభ్యదేశాలు ప్రాధాన్యతనివ్వడం హృదయపూర్వకంగా సంతృప్తిని కలిస్తోంది." అని అన్నారు.

మహమ్మారి సమస్య పరిష్కారానికి సమైక్యంగా జరుగుతున్న కృషి అభినందనీయమని అన్నారు. ఈ విషయంలో ఐక్యరాజ్యసమితికి అనుబంధించిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఒ.), ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు.హెచ్.ఒ.), ప్రపంచ జంతు ఆరోగ్య సంస్థ (డబ్ల్యు.ఒ.ఎ.హెచ్.), ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం (యు.ఎన్.ఇ.పి.) ద్వారా జరుగుతున్న సమగ్ర కృషిని ఆమె అభినందించారు.

ఎ.ఎం.ఆర్. మహమ్మారిపై పోరు సాగించడానికి భారతదేశం తీసుకున్న చర్యలను కేంద్రమంత్రి వివరించారు. ఎ.ఎం.ఆర్. బెడద నిర్మూలనకు, సమస్య పరిష్కరించడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వం వివిధ రకాల కార్యక్రమాలు చేపట్టినట్టు చెప్పారు. 2016లో ఎ.ఎం.ఆర్.పై ఒక సదస్సును భారతప్రభుత్వం న్యూఢిల్లీలో నిర్వహించిందని చెప్పారు. ఆరోగ్యరక్షణకు చేపట్టిన జాతీయ ఎజెండాలో ఎ.ఎం.ఆర్. మహమ్మారిని ఎదుర్కొనే కార్యక్రమాన్ని కూడా చేర్చినట్టు తెలిపారు. అవగాహనా కల్పన, సామర్థ్యాల పెంపుదల, ప్రయోగశాలల బలోపేతం, నిఘా, వైరస్ వ్యాప్తి నిరోధం, నియంత్రణ, యాంటీమైక్రోబయల్ స్టీవార్డ్‌షిప్, కొత్త ఔషధాల రూపకల్పనపై పరిశోధనలు, వ్యాధినిర్ధారణ, ఆవిష్కరణల ద్వారా చేపట్టిన వివిధ కార్యక్రమాలను ఆమె ఈ సందర్భంగా ప్రధానంగా ప్రస్తావించారు. అత్యున్నత స్థాయిలో రాజకీయ సంకల్పంతో, మద్దతుతో ఈ కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు.

ఎ.ఎం.ఆర్. నిరోధం లక్ష్యంగా 2011లో జైపూర్ డిక్లరేషన్‌పై సంతకం చేసిన 11 సభ్య దేశాల ఆరోగ్య మంత్రుల సహకారాన్ని కేంద్రమంత్రి ప్రధానంగా ప్రస్తావించారు. ఎ.ఎం.ఆర్. మహమ్మారి నియంత్రణ కోసం చేపట్టే ఆరోగ్య విధానం పట్ల వారి నిబద్ధతను, రాజకీయ మద్దతును ఇది సూచిస్తోందన్నారు.

ఎ.ఎం.ఆర్.పై న్యూఢిల్లీలో ప్రపంచస్థాయి సదస్సును ప్రారంభించిన ఊపుతోనే, 2024లో ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభలో జరగబోయే అత్యున్నత స్థాయి సమావేశాన్ని సమీకృతం చేయడానికి కృషిచేయాలని డాక్టర్ పవార్ సూచించారు. అన్ని స్థాయిలలో రాజకీయ మద్దతును బలోపేతం చేయడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు.

మస్కట్ సదస్సుకు డబ్ల్యు.హెచ్.ఒ. డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అధనావ్ గెబ్రెయేసస్, ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఒ.) డైరెక్టర్ జనరల్ క్యు.యు. డోంగ్యు, ఒమన్ ప్రభుత్వ ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ హిలాల్ అల్ సబ్తీ, ఒమన్ వ్యవసాయ, మత్స్య సంపద- నీటి వనరుల శాఖ మంత్రి సౌద్ అల్ హబ్సీ, నెదర్లాండ్స్ ఆరోగ్య, సంక్షేమ, క్రీడల శాఖ మంత్రి ఎర్నెస్ట్ క్యైపర్స్, తదితర ప్రముఖులు కూడా హాజరయ్యారు.

# ప్రజల కోసం కేసీఆర్ చేసినన్ని పనులు మరే ముఖ్యమంత్రి చేయలేదు: మంత్రి ఎర్రబెల్లి



మహబూబాబాద్, నవంబర్ 25:(నేటినిజం ప్రతినిధి): నలభై ఏండ్ల రాజకీయ జీవితంలో ప్రజల కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ చేసినన్ని మంచి పనులు మరెవరూ చేయలేదని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మహబూబాబాద్ జిల్లాలోని పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు మండలం నాంచారి మదూర్ గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రారంభోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. 30 ఇండ్లను లబ్ధిదారులకు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

కేసీఆర్ ప్రభుత్వం ఇస్తున్న ఒక్కో డబుల్ బెడ్‌రూమ్ ఇంటి విలువ దాదాపు రూ.25 లక్షలు ఉన్నదని మంత్రి ఎర్రబెల్లి చెప్పారు. కేసీఆర్ చేస్తున్న మంచి పనులను గుర్తించి ఆయనకు అందరూ బాసటగా నిలబడాలని కోరారు. ఒక్క నాంచారి మదూర్ గ్రామంలోనే పెన్షన్ల కోసం రూ.1.42 కోట్లు వచ్చాయని, 512 మందికి పెన్షన్‌లు వస్తున్నాయని అన్నారు. గతంలో తెలుగుదేశంలో గెలిచినప్పుడు ఇన్ని పనులు కాకపోయేవని, కేసీఆర్ అడిగినన్ని డబ్బులు ఇస్తున్నారని చెప్పారు.

నాంచారి మదూర్ చెరువుకు నీళ్ళు తెస్తానని హామీ ఇచ్చానని, ఆ హామీని త్వరలోనే నెరవేరుస్తానని మంత్రి పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. పాలకుర్తి నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణం శరవేగంగా పూర్తవుతున్నదన్నారు. కార్యక్రమంలో సభాధ్యక్షులుగా సర్పంచ్ గుంటక యాదలక్ష్మి, కలెక్టర్ శశాంక, జెడ్పీటీసి మంగళపల్లి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుమర్తి శాంత, ప్యాక్స్ చైర్మన్ హరి ప్రసాద్, మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, పాలకుర్తి దేవస్థాన కమిటీ అధ్యక్షులు రామచంద్రయ్య శర్మ, ఎంపీపీ అంజయ్య, ఎంపీటీసీలు, నాయకులు, రైతు సంఘాల నేతలు పాల్గొన్నారు.

# మత్స్యకారుల బ్రతుకుల్లో కొత్త వెలుగులు : ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



వరంగల్,నవంబర్ 25:మత్స్యకారుల బతుకుల్లో కొత్త వెలుగులు నిండాయని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. ఖిలా వరంగల్ గుండు చెరువు, దేశాయిపేట లోని చిన్న వడ్డేపల్లి చెరువు, కోట చెరువుల్లో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న చేప పిల్లల పంపిణీ కార్యక్రమంలో భాగంగా చెరువులో చేపలు వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ చెరువులను పునరుద్ధరించి చెరువులకు కొత్త కళ తీసుకొచ్చారన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టికి చెరువులే ఆధారం అని, ఆ చెరువులను బాగు చేయడం ద్వారా కుల వృత్తులకు ముఖ్యమంత్రి కేసీఆర్ జీవం పోశారన్నారు. చెరువులో చేప పిల్లల పంపిణీ ద్వారా మత్స్యకారులకు ఆర్థిక పరిపుష్టి సాధించి వారి ఎదుగుదలకు తోడ్పాటు అందిస్తున్నారన్నారు. తెలంగాణ సాధించిన ఫలాలు పేద ప్రజలకు అందజేస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పంతో సంక్షేమం అభివృద్ధిలో దేశంలోనే ముందు వరుసలో నిలిపారు. ఎవరెన్ని కుట్రలు చేసినా తెలంగాణ అభివృద్ధి అడ్డుకోలేరు, ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో మరింత ముందుకు వెళుతుందన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం అన్ని నియోజకవర్గాలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నాం, ఒకవైపు సంక్షేమం మరోవైపు అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందజేస్తున్నామన్నారు. పేదరికం నిర్మూలించడం ఎజెండాగా పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బైరబోయిన ఉమ దామోదర్ యాదవ్, బోగి సువర్ణ సురేష్, సురేష్ జోషి, కావటి కవిత రాజుయాదవ్, మాజీ కార్పొరేటర్ బయ్యా స్వామి, సంగరబోయిన చందర్, చింతాకుల సునీల్, మత్స్యకార సొసైటి ప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గడ్డి మందు విక్రయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి - పెద్దపల్లి ఎస్ఐ రాజేశ్



కరీంనగర్, నవంబర్ 25: గడ్డి మందు విక్రయాల విషయంలో ఫెర్టిలైజర్ షాప్ యజమానులు జాగ్రత్తలు పాటించాలని పెద్దపల్లి ఎస్ఐ రాజేశ్ పేర్కొన్నారు. శుక్రవారం పద్దపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫెర్టిలైజర్ షాప్ యజమాలతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇటీవల గడ్డి మందు తాగుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు పెరిగి పోయాయన్నారు.

గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించడం ద్వారా అందులో ఉండే అత్యధిక మోతాదు రసాయనాల ప్రభావంతో శరీరంలోని అవయవాలు దెబ్బతిని క్షణాల్లో ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయన్నారు. ఎవరైనా వ్యక్తులు ఫెర్టిలైజర్ షాప్‌కు వచ్చి గడ్డి మందు కావాలని అడిగితే వారి వివరాలు తప్పక నమోదు చెసుకోవాలని సూచించారు.

వారి సంబంధికులకు సదరు వ్యక్తి గడ్డి మందు కొనడానికి వచ్చినట్లు సమాచారం అందించి, అవసరమా కాదా ఆరా తీయాలన్నారు. వచ్చిన వ్యక్తి వివరాలు తెలియనట్లయితే ఎట్టి పరిస్థితుల్లో గడ్డి మందు విక్రయించాలని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరు తమ సూచనలు పాటిస్తూ రికార్డ్స్ నమోదు చేయడం ద్వారా ఎంతో మంది విలువైన ప్రాణాలను కాపాడిన వారమవుతామన్నారు. తప్పనిసరిగా వివరాలు నమోదు చేస్తూ రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఫెర్టిలైజర్స్ షాప్ యజమానులు పాల్గొన్నారు.

# రైల్వే సమస్యల పరిష్కరించాలి.. రైల్వే జీఎంకు ఎమ్మెల్యే వినతి



కరీంనగర్, నవంబర్ 25: రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి శుక్రవారం దక్షిణమధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ ను కోరారు. సికింద్రాబాద్ నుండి రామగుండం వైపు వెళ్తున్న జీఎం పెద్దపల్లి రైల్వే స్టేషన్ లో కాసేపు ఆగారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దాసరి జీఎంకు స్వాగతం పలికారు. పెద్దపల్లి, పొత్కపల్లి రైల్వే స్టేషన్లలో నెలకొన్న సమస్యలను జీఎంకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పెద్దపల్లిలో హైదరాబాద్ టు నాగ్ పూర్, నవజీవన్ ఎక్స్ప్రెస్, దక్షన్, కేరళ వంటి రైళ్ళను ఆపాలని కోరారు.కరీంనగర్ – పెద్దపల్లి రైలు మార్గంలో రైల్వే అండర్ బ్రిడ్జిలను విస్తరించాలని, మానేరు నదిపై నిరుపయోగంగా ఉన్న బ్రిడ్జి వద్ద ఆర్ఓబీ నిర్మించాలని విన్నవించారు. పెద్దపల్లి, పొత్కపల్లి రైల్వే స్టేషన్లను ఆధునీకరించి ప్రయాణికులకు సౌకర్యాలు మరింత మెరుగు పరచాలన్నారు. పెద్దపల్లి స్టేషన్ లో ఎస్కలేటర్, పొత్కపల్లిలోట్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. ఇంకా పలు సమస్యలను జీఎం దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దాసరి మమతా రెడ్డి,అధికారులు పాల్గొన్నారు.

# గుజరాత్‌లోనూ పంజాబ్ ఫలితాలు రిపీట్: ఆప్ సీఎం అభ్యర్థి గాధ్వి

ద్వారక, నవంబర్ 25: గుజరాత్ లోనూ పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే పునరావృతమవుతాయని ఆప్ సీఎం అభ్యర్థి ఇసుదాన్ గాధ్వి ధీమా వ్యక్తంచేశారు. ఇవాళ ద్వారకలో ఓ జాతీయ మీడియా సంస్థతో మాట్లాడిన ఆయన.. గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీ పోటీలోనే లేదని, కాబట్టి భారీ మెజారిటీతో ఆమ్ ఆద్మీ పార్టీ గెలుపు ఖాయమని ఆయన చెప్పారు.గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీ అధికార బీజేపీకి బీ టీమ్‌లా పనిచేస్తున్నదని ఆరోపించారు. గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయొద్దని ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ ఇచ్చిన పిలుపుపై కూడా గాధ్వి స్పందించారు. కాంగ్రెస్ పార్టీ ఓట్లను చీలుస్తుందని, ఆ పార్టీ అభ్యర్థులు గెలిచినా తిరిగి బీజేపీలోకే వెళ్లిపోతారని, అందుకే కేజ్రీవాల్ కాంగ్రెస్ పార్టీకి ఓటేయొద్దని పిలుపునిచ్చారని ఆయన చెప్పారు.

గుజరాత్ ప్రజలకు అరవింద్ కేజ్రీవాల్‌పై అపారమైన నమ్మకం ఉన్నదని ఇసుదాన్ గాధ్వి పేర్కొన్నారు. ఆప్ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో కరెంటు సమస్య తీరుతుందని, మంచి ఆరోగ్య, విద్యా సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని ప్రజలు విశ్వసిస్తున్నారని గాధ్వి చెప్పారు. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ పాలనతో ప్రజలు విసిగిపోయారని ఆయన వ్యాఖ్యానించారు.

# జగన్ ప్రభుత్వం తలపెట్టిన మూడు రాజధానులు విధానం తప్పు

### -ఎగ్జిక్యూటివ్, లెజిస్లేటివ్, జ్యుడీషియరీ సిస్టమ్స్ మూడు కలసికట్టుగా ఉంటేనే ప్రజలకు మేలు

### -మాజీ ముఖ్య మంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి

అమరావతి నవంబర్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఎగ్జిక్యూటివ్ లెజిస్లేటివ్ జ్యుడీషియరీ సిస్టమ్స్ మూడు కలసికట్టుగా ఉంటేనే ప్రజలకు మేలు జరుగుతుంది. ఇవి ఒకదానితో ఒకటి అనుసంధానం అవుతూ ప్రజలకు మేలు చేసే విషంలో కీలకంగా ఉంటాయని అన్నారు మాజీ సిఎం నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి.ఈ వ్యవస్థలు మూడూ ఒకే చోట ఉండడం అన్ని విధాలుగా మంచిది అని నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు.. ఈ విషయంలో జగన్ ప్రభుత్వం తలపెట్టిన మూడు రాజధానులు విధానం తప్పు అన్నట్లుగా ఆయన మాట్లాడారు. ప్రముఖ నటుడు నందమూరి బాలక్రిష్ణ ఓటీటీ ద్వారా నిర్వహించే అన్ స్టాపబుల్ ప్రోగ్రాం కి గెస్ట్ గా వచ్చిన కిరణ్ కుమార్ రెడ్డి ఏపీకి కుదిపేస్తున్న కీలకమైన అంశం మూడు రాజధానుల మీద తన అభిప్రాయాన్ని పంచుకున్నారు.మూడు రాజధానులు ఏర్పాటు అన్నది అసమంజసమైన ప్రతిపాదనగానే కిరణ్ కుమార్ రెడ్డి అంటున్నారు. ప్రజాస్వామ్యానికి శాసన కారనిర్వహణ న్యాయ వ్యవస్థలు మూడూ మూల స్థంభాలు అని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులలో వీటిని విడదీయడం మంచింది కాదని అన్నారు. దీని వల్ల ఆర్ధికంగానే కాకుండా అన్ని విధాలుగానూ ఇబ్బందులు తలెత్తుతాయని అన్నారు.శాసనసభ పనిచేస్తున్నపుడు అధికారులు ముఖ్యమంత్రి మంత్రులు ఎమ్మెల్యేలు అందరూ శాసనసభలో ఉండాల్సిన అవసరం ఉంది అని ఆయన గుర్తు చేశారు. అలాగే ఏదైనా అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్ట్ ని కానీ పధకాన్ని కానీ సమీక్షించాలన్న మంత్రులు అధికారులు అంతా ఒకే చోట ఉంటేనే వేగంగా పనులు జరుగుతాయని అన్నారు. ఇక ప్రభుత్వం ఏదైనా ఒక దాన్ని కోర్టులో సవాల్ చేయాలంటే మంత్రులు ముఖ్యమంత్రి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. వారంతా అలా కూడా అందుబాటులో ఉంటేనే అది సాధ్యపడుతుందని అన్నారు.ఇలా మూడు వ్యవస్థలు ఒకదాని మీద మరోకటి ఆధారపడి పనిచేస్తాయని అందువల్ల ఈ శాఖలను వేరు వేరు చేయడం వల్ల కాలయాపనతో పాటు పనిలో నాణ్యాత కూడా తగ్గిపోతుంది అని కిరణ్ కుమార్ రెడ్డి అభిప్రాయపడ్డారు. మొత్తానికి చూస్తే ఏపీలో మూడు రాజధానులు అంటున్న జగన్ నిర్ణయం తప్పు అని మాజీ సీఎం గట్టిగానే చెప్పకనే చెప్పారు..అది ఆర్ధికంగానే కాదు ఇతరత్రా ఇబ్బంది అని తెలిసినా కూడా జగన్ సర్కార్ ముందుకే అంటోంది. మరి ఈ విషయంలో బయట అంతా వద్దు అనే చెబుతున్నారు. కానీ జగన్ దీని మీద పట్టు వీడడంలేదు ఆయనకు ఈ విషయంలో నచ్చచెప్పి మూడు కాదు ఒకటే రాజధాని అని తెలియచెప్పేలా మంత్రులు కానీ సీనియర్ నాయకులు కానీ చేయలేరా అంటే ఏమో చూడాల్సి ఉంటుంది మరి.

# అండర్ 14 క్రికెట్ పోటీలకు నూకల మర్రికి చెందిన అభిషేక్ ఎంపిక



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 25: (నేటినిజం ప్రతినిధి): ఈనెల 26,27వరంగల్లో జరిగే అండర్14 క్రికెట్ పోటీల్లో వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామానికి చెందిన విద్యార్థి పొత్తూరు అభిషేక్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగానూకలమర్రి ఎంపీటీసీ బొడ్డు శంకరవ్వ రాములు, సర్పంచ్ పెండ్యాల తిరుపతి, సి వై సి అధ్యక్షుడు రొమాల జగదీష్, యువజన సంఘం నాయకులు సోమినేని బాలు, ప్రభుత్వజిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు తిరుపతి నాయక్ పలువురు అభినందించారు

# ఈనెల 27 న సీనియర్ మహిళ షూటింగ్ బాల్ పోటీలు



కరీంనగర్, నవంబర్ 25: కరీంనగర్ జిల్లాయునైటెడ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో41వ. సీనియర్స్ మహిళల షూటింగ్ బాల్ కరీంనగర్ ఉమ్మడి జిల్లా టోర్నమెంట్ మరియు రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు ఈనెల 27 తేదీన ఆదివారం కరీంనగర్ జిల్లాలోని స్థానిక సప్తగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోటీలు ఎంపిక ఉంటుందని యునైటెడ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఆరిఫ్ పాషా తెలిపారు.

ఆసక్తిగల బాలికలు మహిళలు ఉదయం తొమ్మిది గంటలకు ఆధార్ కార్డ్ జిరాక్స్ తో హాజరుకావాలని కోరారు. వివరాలకు ఫోన్ నెంబర్918143866712) సంప్రదిం చవచ్చునని అన్నారు.

# పురపాలక పట్టణాభివృద్ధిశాఖపై సీఎం జగన్ సమీక్ష

అమరావతి నవంబర్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మున్సిపల్ సర్వీసుల కోసం నగరాలు, పట్టణాల్లో తీసుకు వస్తున్న యాప్‌ను గ్రామాల్లోకూడా అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశించారు. పురపాలక పట్టణాభివృద్ధిశాఖపై సీఎం జగన్ సమీక్ష సమీవేశం నిర్వహించారు.నగరాల్లో, పట్టణాల్లో రోడ్లు, మురుగునీటి కాల్వలు సహా.. ఇతర మౌలిక సదుపాయాలు నిర్వహణ బాగుండాలన్న సీఎం ఇప్పుడు తీసుకొస్తున్న యాప్ ద్వారా వచ్చే గ్రీవెన్స్‌ను పరిష్కరించే వ్యవస్థ బలోపేతంగా ఉండాలన్నారు.వర్షాకాలం సహా అన్ని కాలాల్లోనూ బాగుండేలా రోడ్ల నిర్మాణంలో కొత్త టెక్నాలజీ అంశంపైనాకూడా దృష్టిపెట్టాలన్నారు.దీర్ఘకాలం మన్నే పద్ధతిలో రోడ్ల నిర్మాణం సాగేలా చూడాలని,మున్సిపల్ సర్వీసులు పారదర్శకంగా ప్రజలకు అందాలన్నారు.టౌన్ ప్లానింగ్ సహా.. ఇతరత్రా విభాగాల్లో సాఫ్ట్‌వేర్ అప్లికేషన్స్‌ను పరిశీలన చేయాలని సూచించారు.ప్రజలకు సత్వరంగా సేవలు అందడం, నిర్దేశిత సమయంలోగా అనుమతులు రావడం, అవినీతి లేకుండా చూడ్డమే లక్ష్యంగా మార్పులు తీసుకురావాలని,సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ల్‌పై నిశిత సమీక్షచేసి తగిన ప్రణాళికను రూపొందించాలని సీఎం ఆదేసించారు.రాజమండ్రిలోనూ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంటు నిర్మాణ ప్రతిపాదనకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.28 అర్బన్ లోకల్ బాడీస్‌ను కవర్ చేస్తూ ప్లాంట్ నిర్మాణం.7.5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్.

ఈ సమీక్షా సమావేశంలో పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, పురపాలక పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ వై.శ్రీలక్ష్మి, ఆర్థికశాఖ కార్యదర్శి ఎన్ గుల్జార్, ఏపీసీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండీ డాక్టర్ పి సంపత్ కుమార్, ఏపీజీబీసీఎల్ ఎండీ బి రాజశేఖరరెడ్డి, మెప్మా ఎండీ విజయలక్ష్మి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కేజ్రీవాల్‌ను చంపేందుకు బీజేపీ కుట్ర : మనీశ్ సిసోడియా

న్యూఢిల్లీ, నవంబర్ 25: బీజేపీపై ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా సంచలన ఆరోపణలు చేశారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను హత్య చేసేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందన్నారు. ఈ కుట్రలో బీజేపీ ఎంపీ మనోజ్ తివారీ ప్రమేయం ఉందన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన 'గుజరాత్ అసెంబ్లీ, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఓటమి భయంతో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను హత్య చేసేందుకు బీజేపీ కుట్రపన్నుతోంది. ఈ కుట్రలో బీజేపీ ఎంపీ మనోజ్ తివారీ ప్రమేయముంది. కేజ్రీవాల్‌పై దాడి చేయాలని తమ గూండాలను ఆయన బహిరంగంగానే పురిగొల్పుతున్నారు. ఈ చౌకబారు రాజకీయాలకు మా పార్టీ(ఆప్) భయపడబోదు. బీజేపీ గూండాయిజానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారు' అని స్పష్టంచేశారు.

# ఇటీవలి వాతావరణ సంక్షోభం, వేగవంతమైన సాంకేతిక పురోగతికి ప్రతిస్పందనగా పి.ఎం.ఎఫ్.బి.వై.లో రైతు అనుకూల మార్పులు

న్యూఢిల్లీ, నవంబర్ 25:ఇటీవలి వాతావరణ సంక్షోభం, వేగవంతమైన సాంకేతిక పురోగతికి ప్రతిస్పందనగా ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పి.ఎం.ఎఫ్.బి.వై) లో రైతు అనుకూల మార్పులు తీసుకురావడానికి కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సిద్ధంగా ఉంది.

కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీ మనోజ్ అహూజా మాట్లాడుతూ, వ్యవసాయం నేరుగా వివిధ వాతావరణ విపత్తులకు గురవుతున్న కారణంగా, దేశంలోని దుర్బలమైన వ్యవసాయ సమాజాన్ని ప్రకృతి వైపరీత్యాల నుండి రక్షించడం అనేది చాలా ముఖ్యమైనది, అత్యంత క్లిష్టమైనది, అని పేర్కొన్నారు. ఫలితంగా, పంటల బీమాకు డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. అందువల్ల భారతదేశంలో రైతులకు తగినంత బీమా రక్షణ అందించడానికి పంటలతో పాటు, ఇతర రకాల గ్రామీణ / వ్యవసాయ బీమా ఉత్పత్తులకు మరింత ప్రాధాన్యత ఇవ్వవలసిన అవసరం ఉంది, అని ఆయన సూచించారు.

2016 లో పి.ఎం.ఎఫ్.బి.వై. పథకాన్ని ప్రవేశపెట్టిన తర్వాత, జాతీయ వ్యవసాయ బీమా పథకం (ఎన్.ఏ.ఐ.ఎస్) తో పాటు సవరించిన ఎన్.ఏ.ఐ.ఎస్. కి చెందిన మునుపటి పథకాలలో చేర్చబడని, విత్తే ముందు నుంచి పంటకోత తర్వాత కాలం వరకు అన్ని పంటలు, ప్రమాదాల గురించి ఈ పథకం సమగ్ర కవరేజీని తీసుకువచ్చిందని శ్రీ అహూజా వివరించారు. స్థానికంగా విపత్తులు సంభవించిన సందర్భంలో పంట నష్టం ఆనవాళ్ళు 72 గంటల తర్వాత కనబడకుండా పోయే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని, రైతులు, తమ పంట నష్టం వివరాలు తెలియజేయడానికి ఉన్న గడువును 48 గంటల నుండి 72 గంటలకు పెంచడం వంటి అనేక కొత్త ప్రాథమిక అంశాలు కూడా 2018 లో దాని సవరణ సమయంలో జోడించబడ్డాయి. అదేవిధంగా, 2020 లో దాని పునరుద్ధరణ తర్వాత, ఈ పథకాన్ని రైతులకు మరింత అనుకూలంగా ఉండే విధంగా చేయడానికి, వన్యప్రాణుల దాడి కోసం స్వచ్ఛంద నమోదుతో పాటు, "యాడ్-ఆన్-కవర్" ను చేర్చడం జరిగింది.

శ్రీ అహూజా మాట్లాడుతూ, పి.ఎం.ఎఫ్.బి.వై. పంట బీమా అనుసరణను సులభతరం చేస్తోందని, అలాగే అనేక సవాళ్లను పరిష్కరిస్తూ, పునరుద్ధరించిన పథకంలో చేసిన ప్రధాన మార్పులు పథకం కింద నష్టాల కవరేజితో పాటు, రైతులందరికోసం కోసం ఈ పథకాన్ని స్వచ్ఛందంగా చేయాలనే రైతుల చిరకాల డిమాండును సాకారం చేయాలనే సంకల్పంతో, ఈ పథకం రాష్ట్రాలకు మరింత సౌలభ్యాన్ని కల్పిస్తోందని, తెలియజేశారు.

కొన్ని రాష్ట్రాలు ప్రాథమికంగా ఆర్థిక పరమైన పరిమితుల కారణంగా ప్రీమియం సబ్సిడీలో తమ రాష్ట్ర వాటాను చెల్లించలేకపోవడం వల్ల ఈ పథకం నుండి వైదొలిగాయని, ఆయన తెలియజేశారు. అయితే, వారి సమస్యల పరిష్కారం తర్వాత, 2022 జూలై నుంచి ఆంధ్రప్రదేశ్ ఈ పథకంలో తిరిగి చేరిందని కూడా ఆయన స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలు కూడా తమ రైతులకు సమగ్ర కవరేజీని అందించడానికి పథకంలో చేరాలని ఆలోచిస్తున్నట్లు, ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. చాలా రాష్ట్రాలు పి.ఎం.ఎఫ్.బి.వై. స్థానంలో ప్రత్యామ్నాయ పరిహార నమూనాలను ఎంచుకున్నాయని, అయితే అవి, రైతులకు పి.ఎం.ఎఫ్.బి.వై. స్థాయిలో సమగ్ర నష్ట పరిహారాన్ని అందించడం లేదన్న విషయాన్ని గమనించాలని ఆయన పేర్కొన్నారు.

శ్రీ అహూజా మాట్లాడుతూ, వేగవంతమైన ఆవిష్కరణల యుగంలో, ఖచ్చితమైన వ్యవసాయంతో పి.ఎం.ఎఫ్.బి.వై. పరిధిని, కార్యకలాపాలను మరింతగా విస్తరించడంలో డిజిటలైజేషన్, సాంకేతికత ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయని, పేర్కొన్నారు. అగ్రి-టెక్ తో రూరల్ ఇన్సూరెన్స్ కలిస్తే, సమ్మిళిత ఆర్థికాభివృద్ధికి ఒక మ్యాజిక్ ఫార్ములాగా పనిచేయడంతో పాటు, ఈ పథకంపై నమ్మకాన్ని కలిగిస్తుంది. ఈ పథకం సామర్థ్యం, పారదర్శకతలను మరింతగా పెంచడానికి తీసుకున్న కొన్ని కీలక చర్యల్లో – ఇటీవల ప్రవేశపెట్టిన వాతావరణ సమాచారం, నెట్-వర్క్ సమాచార విధానం (డబ్ల్యు.ఐ.ఎన్.డి.ఎస్); సాంకేతికత ఆధారంగా దిగుబడి అంచనా వ్యవస్థ (వై.ఈ.ఎస్-టెక్); వాస్తవ సమయ పరిశీలనలు, పంటల ఫోటోల సేకరణ (సి.ఆర్.ఓ.పి.ఐ.సి) వంటివి ఉన్నాయి. రైతుల ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించేందుకు, ఛత్తీస్‌గఢ్ లో "బీటా-టెస్టింగ్" విధానంతో ఏర్పాటు చేసిన, ఒక సమగ్ర హెల్ప్ లైన్ వ్యవస్థ పనిచేస్తోంది.

ప్రీమియం చెల్లింపులో కేంద్ర, రాష్ట్ర సహకారం గురించి శ్రీ అహూజా వివరంగా తెలియజేస్తూ, గత 6 సంవత్సరాలలో కేవలం 25,186 కోట్ల రూపాయలు మాత్రమే రైతులు చెల్లించగా, వారికి, 1,25,662 కోట్ల రూపాయల మేర నష్టపరిహారం అందినట్లు పేర్కొన్నారు. ఈ పథకం కింద ప్రీమియంలో ఎక్కువ శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయని కూడా ఆయన తెలియజేశారు. 2016 సంవత్సరంలో ఈ పథకం ప్రారంభించినప్పటి నుంచి రుణం పొందని రైతులు, సన్న, చిన్న కారు రైతుల వాటా 282 శాతం మేర పెరగడంతో, గత 6 సంవత్సరాల కాలంలో, రైతుల్లో ఈ పథకం ఆమోదయోగ్యత గణనీయంగా పెరిగినట్లయ్యిందని కూడా, కార్యదర్శి పేర్కొన్నారు.

2022 లో మహారాష్ట్ర, హర్యానా, పంజాబ్ రాష్ట్రాలలో అధిక వర్షపాతం నమోదుకాగా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్ లలో అత్యల్ప వర్షపాతం నమోదు కావడంతో, చివరకు వరి, పప్పుధాన్యాలు, నూనెగింజలు వంటి పంటలు దెబ్బతిన్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఉరుములు, తుఫానులు, కరువులు, వేడి గాలులు, మెరుపులు, వరదలు, కొండచరియలు విరిగి పడటం వంటి అనిశ్చితి పరిస్థితులు కూడా పెరిగాయి. అనేక శాస్త్ర, పర్యావరణ సంబంధ దినపత్రికలు, ఇతర పత్రికల్లో పేర్కొన్న విధంగా, భారతదేశంలో 2022 సంవత్సరం మొదటి 9 నెలల్లో దాదాపు ప్రతిరోజూ ఇటువంటి పరిస్థితులు సంభవిస్తూనే ఉన్నాయి.

రాబోయే 10 సంవత్సరాల కాలంలో సంభవించే విపరీతమైన వాతావరణ పరిస్థితులను రెండవ అతి పెద్ద ప్రమాదంగా, వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ కు చెందిన గ్లోబల్ రిస్క్ నివేదిక-2022 పేర్కొందనీ, ఆ పరిస్థితులు మన దేశంపై మరింత ప్రతికూల ప్రభావాన్ని చూపే ప్రమాదం ఉందనీ, శ్రీ అహూజా, అభిప్రాయపడ్డారు. అప్పుడు, ప్రపంచంలోని రెండవ అత్యధిక జనాభా కలిగిన భారతదేశానికి ఆహారం అందించాల్సిన బాధ్యత మన వ్యవసాయ సమాజంపై మాత్రమే ఉంటుందని ఆయన హెచ్చరించారు. అందువల్ల, రైతులు వారి ఆర్థిక స్థితిని కాపాడుకుని, వ్యవసాయాన్ని కొనసాగించేలా వారిని ప్రోత్సహించి, భారతదేశంతో పాటు, ప్రపంచానికి కూడా ఆహార భద్రత కల్పించే విధంగా, వారికి భద్రతా వలయాన్ని అందించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రస్తుతం రైతుల నమోదు పరంగా ప్రపంచంలోనే, పి.ఎంఎఫ్.బి.వై. పథకం, అతిపెద్ద పంటల బీమా పథకం కాగా, ప్రతి సంవత్సరం సగటున 5.5 కోట్ల దరఖాస్తుల ద్వారా అందుతున్న ప్రీమియం పరంగా ఇది మూడవ అతిపెద్ద పథకంగా నిలిచింది. ఈ పథకం రైతుపై ఆర్థిక భారాన్ని కనీస స్థాయికి తగ్గిస్తుంది. రబీ సీజన్ లో మొత్తం ప్రీమియంలో 1.5 శాతం చొప్పున, ఖరీఫ్ సీజన్ లో మొత్తం ప్రీమియంలో 2 శాతం చొప్పున మాత్రమే రైతులు చెల్లిస్తారు. కాగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిగిలిన ప్రీమియంను భరిస్తాయి. ఈ పథకం అమలులోకి వచ్చిన గత ఆరు సంవత్సరాల కాలంలో, రైతులు 25,186 కోట్ల రూపాయల మేర ప్రీమియం చెల్లించగా, 2022 అక్టోబర్, 31వ తేదీ నాటికి వారు 1,25,662 కోట్ల రూపాయల మేర నష్టపరిహారాన్ని స్వీకరించారు. 2016 లో పథకం ప్రారంభించినప్పటి నుండి రుణాలు పొందని, అట్టడుగు, చిన్న రైతుల వాటా 282 శాతం పెరిగిందనే వాస్తవం ద్వారా రైతుల్లో ఈ పథకం పట్ల ఆమోదయోగ్యత పెరుగుదలను నిర్ధారించవచ్చు.

2017, 2018, 2019 కష్టతరమైన సీజన్లలో, వాతావరణ పరిస్థితుల వల్ల దెబ్బతిన్న రైతుల జీవనోపాధిని పొందడంలో నిర్ణయాత్మక కారకంగా, ఈ పథకం నిరూపించబడింది. వీటిలో, అనేక రాష్ట్రాలలో వసూలు చేసిన మొత్తం ప్రీమియంలో వంద శాతం కంటే ఎక్కువగా రైతులకు నష్ట పరిహారం చెల్లించడం జరిగింది. ఉదాహరణకు, ఛత్తీస్‌గఢ్ (2017), ఒడిశా (2017), తమిళనాడు (2018), జార్ఖండ్ (2019) రాష్ట్రాలు చెల్లించిన మొత్తం ప్రీమియంలో వరుసగా 384%, 222%, 163%, 159% చొప్పున నష్ట పరిహారాన్ని పొందాయి.

# అంబేద్కర్ జీవిత విశేషాలతో నృత్యరూపక ప్రదర్శన : మంత్రి కొప్పుల ఈశ్వర్



కరీంనగర్, నవంబర్ 25: చరిత్రను ప్రజలకు వివరించేందుకు రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవిత చరిత్రను ప్రజలకు వివరించేందుకు మంత్రి కొప్పుల ఈశ్వర్ సరికొత్త పంథాను ఎంచుకున్నారు. ఎల్ఎం కొప్పుల సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమి సభ్యులతో నృత్య రూపకం ద్వారా అంబేద్కర్ జీవిత విశేషాలను వివరించనున్నారు.

'సంఘం శరణం గచ్ఛామి ' పేరుతో ఈనెల 26 నుంచి డిసెంబర్ 2 వ తేదీ వరకు ధర్మపురి నియోజకవర్గంలోని మండలాల్లో ఉన్న గ్రామాల్లో నృత్య రూపకాన్ని ప్రదర్శించనున్నారు.

ఈ సందర్భంగా నృత్య రూపకానికి సంబంధించిన ప్రదర్శనల కరపత్రాలు, పోస్టర్ ను సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అందరూ అభిమానించే వారిలో డాక్టర్ అంబేద్కర్ ముందు వరుసలో ఉంటారని అన్నారు. అంబేద్కర్ జీవిత విశేషాలు, ఆశయాలు, లక్ష్యాలను అందరూ తెలుసుకోవాలని, ప్రతీ ఒక్కరూ కులమతాలకతీతంగా నృత్యనాటక ప్రదర్శనను తిలకించాలని కోరారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్య పరిరక్షణ

### -శాట్ ఆటోలకు చెత్తను ఇవ్వండి..పరిసరాల పరిశుభ్రతకు దోహదపదండి

### - బౌద్ధనగర్ కార్పొరేటర్ శైలజా ముదిరాజ్

హైదరాబాద్ నవంబర్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );శాట్ ఆటోలకు చెత్తను ఇవ్వండి..పరిసరాల పరిశుభ్రతకు దోహదపదండి అనీ నినాదం తో రామ్‌కీ ఆధ్వర్యం లో బౌద్ధనగర్ డివిజన్ లోని 146వ వార్డులో చెత్తను రోడ్డుపై వేయకూడదని పాఠశాల విద్యార్థులతో అవగాహనా ర్యాలి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక కార్పొరేటర్ శైలజా ముఖ్య అతిధిగా విచ్చేసి ర్యాలీని ప్రారంబించారు.





ఈ సందర్భంగా కార్పొరేటర్ శైలజా మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్య పరిరక్షణ ముడివడి ఉంటుందని అన్నారు.ప్రతి ఒక్కరు శాట్ ఆటోలకు చెత్తను అందజేసి పరిసరాల పరి శుభ్రతను కాపాడాలని పిలుపు నిచ్చారు.

అనంతరం రామ్‌కీ జోనల్ హెడ్ గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ శాట్ ఆటోలకు చెత్తను వేసి పరిసరాల పరిశుభ్రతను కాపాడాలన్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నపుడు మనం రోగాల బారిన పడుతామన్నారు. రామ్‌కీ డబ్ల్యుఎఫ్‌ఏ మానస గౌడ్ మాట్లాడుతూ పరిసరాలతో పాటు మన ఇళ్ళల్లో కుడా ప్రతి రోజు చెత్తను తొలిగించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని,క్రిమి కీటకాలు రాకుండా చూసుకొని తమ తమ ఆరోగ్యాలను పరిరక్షించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమం లో రాంకీ సర్కిల్ ఇంచార్జి దశరథ్,ఎస్ఎస్ ధన గౌడ్,శ్రీకాంత్, లావణ్య,పద్మావతి,శోభ, స్వర్ణ తో పాటు పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు ర్యాలీ లో పాల్గొన్నారు.

## జీఎస్టీ పరిహారం నిధుల విడుదల

న్యూఢిల్లీ, నవంబర్ 25:రెండు తెలుగు రాష్ట్రాలకు చెల్లించాల్సిన జీఎస్టీ పరిహార నిధులు ఎట్టకేలకు విడుదలయ్యాయి. రాష్ట్రాలకు జీఎస్టీ పరిహారం నిధులను కేంద్రం విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ.682కోట్లు విడుదల చేయగా, తెలంగాణ రాష్ట్రానికి రూ.542కోట్లు విడుదల చేసింది.

# తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న సి ఎస్ సమీర్ శర్మ



తిరుపతి, నవంబర్25 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని శుక్రవారం ఉదయం కుటుంబ సమేతంగా దర్శించుకున్న గౌ. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ.ఆలయ ముఖ ద్వారం వద్ద చేరుకున్న వీరికి టీటీడి జే ఈ ఓ వీరబ్రహ్మం, డిప్యూటీ ఈ ఓ లోకనాధం, ఏ ఈ ఓ ప్రభాకర్ రెడ్డి, తిరుపతి ఆర్డీఓ కనక నరస రెడ్డి సాంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి జేఈఓ వీరబ్రహ్మం ఈ సందర్భంగా సమీర్ శర్మ దంపతులకు అమ్మవారి తీర్థప్రసాదాలు, అందజేశారు. అనంతరం అమ్మవారి బ్రహ్మోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి



ఖమ్మం, నవంబర్ 25: (నేటినిజం ప్రతినిధి): భవన నిర్మాణాల్లో వేగం పెంచి, త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ రఘునాథపాలెం మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న తహసీల్దార్, పోలీస్ స్టేషన్ నూతన భవనాల నిర్మాణ పురోగతిని క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. భవన ప్లాన్ ను కలెక్టర్ పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయ భవనం రెండు నెలల్లో పూర్తికానున్నట్లు అధికారులు కలెక్టర్ కు తెలిపారు. రికార్డు రూమ్, పబ్లిక్ టాయిలెట్స్, అదనపు గదులు ఉండేలా చూడాలన్నారు. పోలీస్ స్టేషన్ భవనంలో వాష్ రూం, వెయిటింగ్ షెడ్లు, రిషిప్షన్, ఫెలిసిటేషన్ సెంటర్, పార్క్ కు ప్రణాళిక చేయాలన్నారు. పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. భవనానికి అడ్డంకిగా ఉన్న విద్యుత్ స్తంభాలు, లైన్ పై వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు.

కలెక్టర్ తనిఖీ సందర్భంగా అదనపు కలెక్టర్ ఎన్. మధుసూదన్, ఖమ్మం ఆర్డీవో రవీంద్రనాథ్, ఏసీపీ బస్వారెడ్డి, పీఆర్ ఇఇ కెవికె. శ్రీనివాస్, రఘునాథపాలెం మండల తహసీల్దార్ నర్సింహారావు, జెడ్పిటిసి ప్రియాంక, అధికారులు తదితరులు ఉన్నారు.

# మహిళా సంఘనీ నూతన భవన నిర్మాణానికి భూమి పూజ



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 25: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండలం చంద్రగిరి గ్రామంలో మహిళా సంఘం నూతన భవన నిర్మాణానికి స్థానిక సర్పంచ్ రాజేష్ తో కలిసి ఎంపీపీ బూర వజ్రమ్మ, జెడ్పిటిసి జడ్పిటిసి మ్యకల రవి భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దిపీట వేస్తుందని అన్నారు. శాసనసభ్యులు చెన్నమనేని రమేష్ బాబు సహకారంతో సిడిపి నిధుల నుండీ 3 లక్షల రూపాయలు మంజూరికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం కొట్లాడి సాధించుకున్న తరుణంలో రాష్ట్రమంతట అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. మహిళలకు పెద్దపీట వేసిన ప్రభుత్వం టిఆర్ఎస్ ప్రభుత్వమేనని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ రసూరి రాజేష్, పంచాయితీ రాజ్ ఏఈ పవన కుమారి, మహిళా సంఘాల అధ్యక్షురాలు సంజన,మహేష్, మహిళా సంఘం సభ్యులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు..

కవిత విద్యా సాంస్కృతిక సేవా సంస్థ, కడప
42-169, యన్.జి.ఓ. కాలనీ, వై.యస్.ఆర్. జిల్లా, ఆంధ్రప్రదేశ్
సెల్: 9177013845, 9849351604, 08562-253734
అలపర్తి పిచ్చయ్య చౌదరి
వ్యవస్థాపక అధ్యక్షులు
పత్రికా ప్రకటన
డాక్టర్ కవిత స్మారక జాతీయ సాహిత్య పురస్కారాలు
2022-23 సంవత్సరానికి కవిత విద్యాసాంస్కృతిక సేవాసంస్థ జాతీయ సాహిత్య పురస్కారాలకు ప్రకటిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు అలపర్తి పిచ్చయ్యచౌదరి, కోశాధికారి శ్రీమతి బోయపాటి దుర్గాకుమారిగార్లు ఒక ప్రకటనలో తెలియజేశారు.
ఈ సంవత్సరానికి - కందుకూరి నవలా పురస్కారం - ఎమ్.ఆర్. అరుణకుమారి (చిత్తూరు) 'కన్నీటి చేవ్రాలు'; గురజాడ కథాపురస్కారం - భండారు విజయ (హైదరాబాద్) 'గణిక'; శ్రీశ్రీ కవితాపురస్కారం - పద్మావతి రాంభక్త (విశాఖపట్నం) కొత్తవేకువ ; జానమద్ది సాహిత్య పురస్కారం - ఆచార్య కిన్నెర శ్రీదేవి (కుప్పం) 'కథ'-విమర్శ; డా॥ రావూరి భరద్వాజ బాల సాహిత్య పురస్కారం- సమ్మెట ఉమాదేవి (సికింద్రాబాద్)'మా పిల్లల ముచ్చట్లు' గార్లను ఎంపిక చేయడం జరిగింది.
పురస్కార గ్రహీతకు రూ.5000/- నగదు బహుమతి, శాలువా, సన్మానంతో పెద్దల సమక్షంలో సత్కరిస్తాము. ఎంపిక కాబడిన రచయిత్రులకు మొత్తము రూ.25,000/-లు నగదు బహుమతి అందజేయబడుతుంది.
2022 డిసెంబర్ 4వ తేది ఆదివారం ఉదయం 10 గం॥లకు విజయవాడ - గాంధి నగర్‌లోని యన్.జి.ఓ.హోమ్ భవనంలో ప్రముఖుల సమక్షంలో పురస్కార ప్రదానోత్సవం నిర్వహించబడుతుందని కవిత విద్యాసాంస్కృతిక సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు తెలిపారు.



ఎమ్.ఆర్. అరుణకుమారి (చిత్తూరు) 'కన్నీటి చేవ్రాలు'
కందుకూరి నవలాపురస్కారం



భండారు విజయ (హైదరాబాద్) 'గణిక'
గురజాడ కథాపురస్కారం



కిన్నెర శ్రీదేవి (కుప్పం) 'కథ' - విమర్శ
జానమద్ది సాహిత్య పురస్కారం - విమర్శ



సమ్మెట ఉమాదేవి (సికింద్రాబాద్) 'మా పిల్లల ముచ్చట్లు'
డా॥ రావూరి భరద్వాజ బాల సాహిత్య పురస్కారం



పద్మావతి రాంభక్త (విశాఖపట్నం) 'కొత్తవేకువ'
శ్రీశ్రీ కవితా పురస్కారం
(అలపర్తి పిచ్చయ్యచౌదరి)
అధ్యక్షులు, కవిత విద్యాసాంస్కృతిక సేవా సంస్థ, కడప

# రాబోయే ఐదేండ్లు గడ్డుకాలమే : జై శంకర్



న్యూఢిల్లీ, నవంబర్ 25:రాబోయే ఐదేండ్లు భారత్ సహా ప్రపంచం గడ్డు పరిస్థితులను ఎదుర్కోనుందని విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్ జైశంకర్ అన్నారు. రాబోయే అర్ధ దశాబ్దంలో దీటుగా ముందుకు సాగేందుకు భారత్‌కు సమర్ధవంతమైన నాయకత్వం అవసరమని ఆయన పేర్కొన్నారు.

ప్రపంచం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నా భారత్ మెరుగైన స్థితిలోనే ఉందని, ప్రపంచానికి దిక్సూచీలా భారత్ ఉంటుందని ఐఎంఎఫ్ గుర్తించిందని ఓ వార్తా ఛానెల్‌తో మాట్లాడుతూ జైశంకర్ వ్యాఖ్యానించారు. ప్రపంచవ్యాప్తంగా పరిస్థితులు సంక్లిష్టంగా మారితే భారత్‌కు గడ్డుకాలం తప్పదని అన్నారు. రాబోయే ఐదేండ్లలో ఆర్థిక సునామీ తప్పదని, ఈ క్రమంలో మనకు దీటైన నాయకత్వం అవసరమని జైశంకర్ స్పష్టం చేశారు.

సరైన వ్యవస్థలను గాడిలో పెట్టి సంక్లిష్ట పరిస్థితులను విశ్వాసంతో ఎదుర్కొని సరైన జడ్జిమెంట్‌తో మనం ముందుకెళ్లాలని అన్నారు. ఆర్థిక వ్యవస్థను నిశితంగా పరిశీలిస్తూ సంస్కరణల అమలుతో గడ్డు కాలాన్ని ఎదురీదాలని చెప్పుకొచ్చారు. ప్రపంచ చోదక శక్తిగా భారత్ పట్ల ప్రపంచం ఇదే దృక్పధాన్ని కలిగిఉందని అన్నారు. భారత్ వృద్ధి రేటు కొనసాగుతుందని ఐఎంఎఫ్ వంటి అంతర్జాతీయ సంస్థలు అంచనా వేస్తున్నాయని ఆయన గుర్తుచేశారు.

# 61వ ఫార్మసీ జాతీయ వారోత్సవాల వేడుకలు




మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జాతీయ ఫార్మసీ వారోత్సవాల వేడుకలు తెలంగాణ సాంఘిక సంక్షేమ ఫార్మసి కళాశాలలో నవంబర్ 23 నుండి 26 వరకు జరుపుకుంటున్నారు. ఈ ఫార్మసీ వారోత్సవ సందర్భంగా శుక్రవారం మహబూబాద్ జిల్లా తాసిల్దార్ కార్యాలయం నుండి ప్రభుత్వ ఆసుపత్రి వరకు ఫార్మా ర్యాలీ తీయడం జరిగింది. ఈ ఫార్మా ర్యాలీని డాక్టర్ బి.హరీష్ రాజ్ జిల్లా మెడికల్ జనరల్ ఆఫీసర్ ప్రారంభించడం జరిగింది. ఫార్మసీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వాసంతి మాట్లాడుతూ ఫార్మసిస్టులు ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర వహిస్తున్నారు. ఔషధాల తయారీ వాటి నాణ్యత ప్రమాణాలను పర్యవేసించడం తగిన సాంకేతిక పరిజ్ఞానంతో ఔషధాలను నిలువ చేయడం వ్యాధిగ్రస్తులకు మందుల వినియోగం పట్ల తగిన సూచనలు సలహాలను అందజేయడం వాటి దుష్ఫలితాల పట్ల అవగాహన కల్పించడం లాంటి అనేక విషయాలలో ఫార్మసిస్టు పాత్ర విస్మరించలేనిది. ఔషధాల ఉత్పత్తిలో భారతదేశం మూడవ స్థానంలో ఉంది ప్రపంచానికి కావలసిన 60 శాతం వ్యాక్సిను, 20 శాతం జనరిక్ మందులను భారతదేశముందే ప్రపంచ దేశాలు అందుకుంటున్నాయి. ఈ కారణంగా మన దేశంలో ప్రపంచ ఔషధాల దేశంగా అభివర్ణిస్తూ ఈ సంవత్సరం ఈ వారోత్సవాల విధానాన్ని ఎంచుకొని వేడుకలు జరుపుకుంటున్నాము. ఈ వారసువాల్లో భాగంగా సైన్ టిఫిక్, పేపర్ ప్రజెంటేషన్, క్విజ్, జనరల్ ప్రజెంటేషన్, స్పోర్ట్స్, మరియు కో–కర్యులర్ యాక్టివిటీస్ పోటీలు నిర్వహించుకున్నాము. ఈ ర్యాలీ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ దయాకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వాసంతి, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, సిబ్బంది, ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.




# విద్యార్థి దశ నుంచే పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలి : మంత్రి సత్యవతి రాథోడ్



మహబూబాబాద్, నవంబర్ 25:(నేటినిజం ప్రతినిధి): విద్యార్థి దశ నుంచే పరిశోధనలపై విద్యార్థులు ఆసక్తిని పెంచుకోవాలని రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ (బాలికల) స్కూల్, జూనియర్ కాలేజీలో నిర్వహించిన జిల్లా వైజ్ఞాన ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైన్స్ ఫెయిర్ కార్యక్రమాలతో విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయవచ్చని వెల్లడించారు. పరిశోధనల పట్ల ఆసక్తి పెంచుకోవడం వల్ల భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశాలుంటాయని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యార్థుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఆమె వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణలు సత్ఫలితాలనిస్తున్నాయని అన్నారు. సర్కార్ బడులల్లో అవసరమైన వసతులు కల్పించేందుకు ప్రవేశపెట్టిన మనఊరు–మనబడితో ప్రభుత్వ బడుల రూపురేఖలు మారాయిని స్పష్టం చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల నమోదు గణనీయంగా పెరిగిందన్నారు.

పర్యావరణ పరిరక్షణ, విద్యుత్ ఉపకరణాలు, ఆదర్శ గ్రామాలు, స్వచ్ఛ భారత్, నూతన సాగు పద్ధతులు, రీసైక్లింగ్ ప్రాసెస్, వినూత్న వైజ్ఞానిక ఆవిష్కరణలను మంత్రి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ కుమారి అంగోత్ బిందు, శాసనసభ్యులు బానోత్ శంకర్ నాయక్, డీఈవో, ప్రిన్సిపాల్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గతంలో నిలిపివేసిన ఖాతాలకు ఎలన్ మస్క్ 'క్షమాభిక్ష'

## – వచ్చేవారం నుంచే పాత ట్విటర్‌లకు పునరుద్ధరణ ప్రక్రియ మొదలు

న్యూ ఢిల్లీ నవంబర్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ట్విటర్ లో సమూల మార్పులకు ఎలన్ మస్క్ శ్రీకారం చుట్టారు. తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. పలు కారణాలతో గతంలో నిలిపివేసిన ఖాతాలకు 'క్షమాభిక్ష' పెడుతున్నట్లు ప్రకటించారు. వచ్చేవారం నుంచే ఆ ఖాతాల పునరుద్ధరణ ప్రక్రియ మొదలుపెట్టనున్నట్లు ట్విటర్ లో వెల్లడించారు. ట్విటర్ లో నిలిపివేసిన ఖాతాలకు 'క్షమాభిక్ష' పెట్టాలా? వద్దా? అన్న దానిపై ఎలన్ మస్క్ గురువారం పోలింగ్ నిర్వహించారు. ఈ పోలింగ్ 31.6 లక్షల మంది పాల్గొన్నారు. 72.4 శాతం మంది అనుకూలంగా ఓటెయ్యగా.. 27.6 శాతం మంది వ్యతిరేకించారు. అత్యధిక మంది క్షమాభిక్షకు ఓకే చెప్పడంతో మస్క్ ఆ ఖాతాలను పునరుద్దరించేందుకు సిద్ధమయ్యారు. 'ప్రజలే న్యాయ నిర్ణేతలు.. వచ్చేవారం నుంచి ఈ క్షమాభిక్ష మొదలవుతుంది. ప్రజల మాటే.. దేవుడి మాట ' అని ఎలన్ మస్క్ నేడు ట్వీట్ చేశారు. విద్వేషపూరిత పోస్టులు లేదా నకిలీ సమాచార వ్యాప్తి తదితర కారణాలతో గతంలో పలువురి ఖాతాలను ట్విటర్ నిలిపివేసిన విషయం తెలిసిందే. ఇందులో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహా పలువురు ప్రముఖులు కూడా ఉన్నారు. అయితే ట్విటర్ ను మస్క్ హస్తగతం చేసుకున్న తర్వాత.. ఆ ఖాతాలను పునరుద్ధరిస్తారని ఊహాగానాలు వచ్చాయి. అన్నట్లుగానే ఇటీవల.. ట్రంప్ ఖాతాను పునరుద్ధరించేందుకు పోలింగ్ పెట్టారు. మెజార్టీ నెటిజన్లు అనుకూలంగా ఓటెయ్యడంతో ఆయన ఖాతాను మళ్లీ యాక్టివ్ లోకి తెచ్చారు. ట్విటర్ లో వేలమంది ఉద్యోగులను తొలగించిన తర్వాత మస్క్ కు కొత్త చిక్కులు మొదలయ్యాయి. వీటిని పరిష్కరించేందుకు ఆయన కొత్త వారిని నియమించుకుంటున్నారు. తాజాగా ట్విటర్ సెర్చ్ లో తలెత్తిన సమస్యను సరిచేసేందుకు జార్జ్ హాట్జ్ అనే వ్యక్తిని నియమించినట్లు సమాచారం. 2007లో ఐఫోన్ హ్యాక్ చేసిన తొలి వ్యక్తిగా జార్జ్ హాట్జ్ పాపులర్ అయ్యారు.

# జెఎల్ఎన్ స్టేడియంలో విజయవంతంగా ముగిసిన ఫిట్ ఇండియా ఫ్రీడం రైడర్ బైక్ ర్యాలీలు

న్యూఢిల్లీ, నవంబర్ 25:సుమారు 75 రోజుల పాటు, 11 మంది మహిళలు సహా 75 రైడర్లు 75 పట్టణాలు/ నగరాలలో 18000+ కిలోమీటర్ల వ్యాప్తంగా 34 రాష్ట్రాలు/ కేంద్ర పాలిత ప్రాంతాలలో కన్యాకుమారి నుంచి వారణాసి వరకు, గాంధీనగర్ నుంచి షిల్లాంగ్ వరకు ప్రయాణించారు.

ఫ్రీడం రైడర్ బైకర్ ర్యాలీల ముగింపు వేడుక గురువారం నాడు న్యూఢిల్లీలోని జెఎల్ఎన్ స్టేడియంలో జరిగింది. ఈ ప్రత్యేక యాత్రను భారత ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక కార్యక్రమమైన ఫిట్ ఇండియా మద్దతుతో ఆలిండియా మోటర్ బైక్ ఎక్స్‌పెడిషన్ (ఎఐఎంఇ) నిర్వహించింది.

ఈ ముగింపు వేడుకకు యువజన వ్యవహారాలుడ క్రీడల మంత్రిత్వ శాఖ కార్యదర్శి (క్రీడలు) శ్రీమతి సుజాత చతుర్వేది, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ – జనరల్ శ్రీ సందీప్ ప్రధాన్, కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ, భారత క్రీడా ప్రాధికార సంస్థకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. సుమారు 75 రోజుల పాటు, 11 మంది మహిళలు సహా 75 రైడర్లు 75 పట్టణాలు/ నగరాలలో 18000+ కిలోమీటర్ల వ్యాప్తంగా 34 రాష్ట్రాలు/ కేంద్ర పాలిత ప్రాంతాలలో కన్యాకుమారి నుంచి వారణాసి వరకు, గాంధీనగర్ నుంచి షిల్లాంగ్ వరకు ప్రయాణించారు.

ఈ ప్రయాణంలో భాగంగా, రైడర్లు కేవడియాలోని స్టాట్యూ ఆఫ్ యూనిటీ, సిమ్లాలోని వైస్‌రీగల్ లాడ్జ్, గువాహతిలో కామాఖ్య ఆలయం, మధురైలో మీనాక్షి ఆలయం వంటి ప్రదేశాలను కూడా సందర్శించారు. వారు ఉత్తర ప్రాంతంలోని మైదానాలు, పశ్చిమాన ఇసుక దిబ్బలు, ఈశాన్యంలో పర్వతశ్రేణులు, దక్షిణాన తీరప్రాంతాలు, సియాచిన్ వంటి మంచు ప్రదేశాలలో భిన్నమైన, తీవ్రమైన వాతావరణ పరిస్థితులు, భౌగోళిక ప్రాంతాలలో ప్రయాణాన్ని సాగించారు.

ఈ అసాధారణ సాహసం చేసిన 75మందినీ అభినందిస్తున్నాను, వీరంతా సురక్షితంగా తిరిగి వచ్చినందుకు, చాలామందికి స్ఫూర్తినిచ్చినందుకు ఆనందిస్తున్నాను, అని శ్రీమతి సుజాతా చతుర్వేది పేర్కొన్నారు. ఆరోగ్యంగా, స్వస్థంగా ఉండేందుకు, అందరూ ఈ జాతీయ విధి కోసం పని చేస్తూ, ఆరోగ్యం, స్వస్థతలో ఉత్తమంగా ఉండాలన్నారు.

ఈ కార్యక్రమాలకు ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి, మణిపూర్ గవర్నర్, గుజరాత్ స్థానిక ఎంపీలు, జిల్లా మేజిస్ట్రేట్లు, ఇతర ప్రముఖులు హాజరై, పాల్గొన్నారు. ఈ ఈవెంట్ల సందర్భంగా, ఈ బైకర్ల దళం తమ యాత్ర గురించి మాట్లాడడమే కాక తమ అనుభవాలను పంచుకుంటూ ప్రేక్షకులకు ఫిట్‌నెస్ విషయంలో ప్రేరణనిచ్చేందుకు ఉత్తేజపరిచే ఉపన్యాసాన్ని ఇచ్చారు. రైడర్లు గుజరాత్‌లో గార్బా వంటి ప్రత్యేక ప్రదర్శనలలో పాల్గొనడం అన్నది ఈ యాత్ర కీలకాంశాలలో ఒకటి.

అందరిలోనూ అతి పాత మహిళా రైడర్, నీతా ఖండేకర్ (59) మాట్లాడుతూ, నా తోటి రైడర్ల నుంచి మార్గదర్శనం అద్భుతంగా ఉంది. ముఖ్యంగా ఈశాన్య ప్రాంతంలో భూభాగం పూర్తిగా భిన్నం. అక్కడ మట్టి, బురదతో కూడిన రోడ్లు ఉన్నాయి. మేం ప్రతిసారీ పడ్డాం, కానీ పైకి లేచాం. మేం సోదరభావం గురించి కూడా నేర్చుకున్నాం. ఒంటరి రైడర్‌గా ఉండటం నుంచి మేం రైడర్ల బృందంగా ఏర్పడి, తేలికపాటి భారంతో ప్రయాణించడం నేర్చుకున్నాం.

ఈ ప్రయాణం గురించి కొన్ని ఆలోచనలను పంచుకుంటూ, దాదాపు 20 ఏళ్ళపాటు నడిపిన తర్వాత అఖిల భారత రైడ్‌లో పాల్గొనేందుకు ఎంపిక కావడం అన్నది, మనకు అభిరుచి ఉంటే అది మనల్ని ఏదో ఒక ఉన్నత స్థాయికి తీసుకువెడుతుందనడానికి నేనే ఒక నిదర్శనం అని సిక్కిం కి చెందిన బైకర్ అయిన రోషన్ ఛెత్రీ చెప్పారు. మా భాగస్వామి అయిన మోటర్‌సైకిల్ కారణంగా ఈ ప్రయాణం ద్వారా మా కళ్ళతో మొత్తం దేశాన్ని చూశాం అన్నారు.

ఈ 75 రైడర్లు దేశంలోని ప్రతి రాష్ట్రం నుంచి రావడంతో మినీ–ఇండియాని తలపించారు. అది మండే ఎండలు, వానలు, చలి అయినా, మేం ఒకరికొకరం స్ఫూర్తిని ఇచ్చుకుని ముందుకుసాగాం. ఈ ప్రయాణంలో వేం కొన్ని హృదయాలను స్పృశించగలిగాం. సందేశం ఫిట్‌నెస్‌కు సంబంధించిందే అయినా సాధ్యమైనంతగా జ్ఞానాన్ని అందించి, సౌభ్రాతృత్వం అనే భావనను వ్యాప్తి చేశాం. మేం మంచి జ్ఞాపకాలతో తిరిగి వెడుతున్నాం అని పేర్కొన్నారు

# భారతదేశ శ్వేత విప్లవ పితామహుడు" 101 వ జయంతి సందర్భంగా బెంగళూరులో జాతీయ పాల దినోత్సవాన్ని నిర్వహించనున్న పశుసంవర్ధక శాఖ

న్యూఢిల్లీ, నవంబర్ 25:"భారతదేశ శ్వేత విప్లవ పితామహుడు" 101 వ జయంతి సందర్భంగా పశుసంవర్ధక, పాడి పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో 2022 నవంబర్ 22న బెంగళూరులో జాతీయ పాల దినోత్సవం జరుగుతుంది. "ఆజాదీ కా అమృత్ మహోత్సవ్" లో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో ప్రతిష్టాత్మక 2022 జాతీయ గోపాల రత్న అవార్డులు ప్రదానం చేస్తారు. కంద్ర పశుసంవర్ధక , పాడి పరిశ్రమ, కర్ణాటక రాష్ట్ర పశుసంవర్ధక మరియు మత్స్య శాఖ, కర్ణాటక, జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి బోర్డు, కర్ణాటక పాల సమాఖ్య కలిసి ఈ చిరస్మరణీయమైన జాతీయ కార్యక్రమాన్ని కర్ణాటక రాష్ట్రంలో నిర్వహిస్తున్నాయి.

కేంద్ర మత్స్య పశుసంవర్ధక మరియు పాడి పరిశ్రమల శాఖ సహాయ మంత్రి డాక్టర్ సంజీవ్ కుమార్ బల్యాన్, కర్ణాటక హెసెరఘట్టలోని సెంట్రల్ ఫ్రోజెన్ సెమెన్ ప్రొడక్షన్ అండ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో అధునాతన బోవిన్ ఎంఈ–(ఇన్విట్రో–ఫెర్టిలైజేషన్) శిక్షణ సౌకర్యానికి శంకుస్థాపన చేస్తారు. , బెంగళూరులో హెసెరఘట్ట సెంట్రల్ క్యాటిల్ బ్రీడింగ్ ఫామ్ కార్యకలాపాలను కూడా మంత్రి వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారు.

ఈ కార్యక్రమంలో వర్గీస్ కురియన్ జీవితానికి సంబంధించిన పుస్తకాన్ని, పాల కల్తీపై బుక్‌లెట్‌ను కూడా ప్రముఖులు విడుదల చేస్తారు.

కేంద్ర మత్స్య పశుసంవర్ధక మరియు పాడి పరిశ్రమల శాఖ సహాయ మంత్రి డాక్టర్ సంజీవ్ కుమార్ బల్యాన్ తో పాటు, కర్ణాటక పశుసంవర్ధక శాఖ మంత్రి శ్రీ.ప్రభు బి. చౌహాన్, కర్ణాటక పాల సమాఖ్య చైర్మన్ శ్రీ బాలచంద్ర ఎల్. జార్కిహోళి కూడా ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు. కేంద్ర పశుసంవర్ధక , పాడి పరిశ్రమ, కర్ణాటక రాష్ట్ర పశుసంవర్ధక కార్యదర్శి శ్రీ రాజేష్ కుమార్ సింగ్ పశు సంవర్ధక మరియు పాడి పరిశ్రమ శాఖ మరియు అదనపు కార్యదర్శి (పశువులు మరియు పాడిపరిశ్రమ అభివృద్ధి) శ్రీమతి వర్ష జోషి కూడా ఈ కార్యక్రమంలో ప్రసంగిస్తారు.

హెస్సరఘట బెంగళూరులో వేడుకల్లో భాగంగా జంతు నిర్బంధ ధృవీకరణ సేవలను డాక్టర్ సంజీవ్ కుమార్ బల్యాన్ ప్రారంభిస్తారు. నిర్ణీత సమయంలో పశువుల ఉత్పత్తులు మరియు పశువుల దిగుమతుల కోసం ఆన్‌లైన్ క్లియరెన్స్ సిస్టమ్‌ను ఇఖిఆ లో ఏర్పాటు చేస్తారు. దీనివల్ల స్థానిక ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది.

# 2023-25 కాలానికి గాను ఇంటర్నేషనల్ ఎలక్ట్రోటెక్నికల్ కమిషన్ (ఐఈసీ) వైస్ ప్రెసిడెన్సీ మరియు స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్ బోర్డ్ (ఎస్ఎంబి) చైర్‌కు ఎన్నికైన భారతదేశం

న్యూఢిల్లీ, నవంబర్ 25:2023–25 కాలానికి గాను ఇంటర్నేషనల్ ఎలక్ట్రోటెక్నికల్ కమిషన్ (ఐఈసీ) వైస్ ప్రెసిడెన్సీ మరియు స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్ బోర్డ్ (ఎస్ఎంబి) చైర్‌కు ఎన్నికైన భారతదేశం

ఇటీవల యూఎస్ఏలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో జరిగిన అంతర్జాతీయ ఎలక్ట్రోటెక్నికల్ కమిషన్ (ఐఈసీ) జనరల్ మీటింగ్‌లో భారత ప్రతినిధి, అంతర్జాతీయ ఎలక్ట్రోటెక్నికల్ కమిషన్ (ఐఈసీ) యొక్క ఇండియన్ నేషనల్ కమిటీ సభ్యుడు మరియు పూర్తి సభ్యులు వేసిన 90% ఓట్లను సాధించడం ద్వారా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐఎస్–ఇండియా)కు చెందిన వివిధ సాంకేతిక కమిటీలు ఎన్నుకోబడ్డాయి.

ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్ (ఐఎస్ఓ) మరియు ఐఈసీ పాలసీ మరియు గవర్నెన్స్ బాడీలలో బిఐఎస్ (భారతదేశం) ప్రాతినిధ్యం ముఖ్యమైన వ్యూహాత్మక మరియు విధాన విషయాలపై భారతీయ దృక్కోణాలను నిర్ధారిస్తుంది.

అలాగే అంతర్జాతీయ ఉత్తమ పద్ధతులతో జాతీయ ప్రామాణీకరణ ప్రాధాన్యతలను సమలేఖనం చేయడానికి అవకాశాలను అందిస్తుంది.

కేంద్ర వాణిజ్యం మరియు పరిశ్రమలు, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం ఒ ప్రజాపంపిణీ మరియు జౌళి శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ అందించిన వృద్ధి మంత్రంపై పని చేయడం ద్వారా బిఐఎస్ తన అంతర్జాతీయ ఖ్యాతిని నిరంతరం విస్తరిస్తోంది. ప్రస్తుతం ఐఎస్ఓ కౌన్సిల్, ఐఎస్ఓ టెక్నికల్ మేనేజ్‌మెంట్ బోర్డ్ (టీఎంబి), ఐఈసి ఎస్ఎంబి, ఐఈసి మార్కెట్ స్ట్రాటజీ బోర్డ్ (ఎమ్ఎస్‌బి), ఐఈసి బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బిఏసి) మొదలైన కమిటీల్లో ప్రాతినిధ్యం వహిస్తోంది.

ఇంటర్నేషనల్ ఎలక్ట్రోటెక్నికల్ కమిషన్ (ఐఈసి) అనేది అన్ని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ మరియు సంబంధిత టెక్నాలజీలపై అంతర్జాతీయ ప్రమాణాలను ప్రచురించే అంతర్జాతీయ ప్రమాణ సెట్టింగ్ సంస్థ. స్టాండర్డైజేషన్ మేనేజ్‌మెంట్ బోర్డ్ (ఎస్ఎంబి) అనేది సాంకేతిక విధాన అంశాలకు బాధ్యత వహించే ఐఈసికు చెందిన అపెక్స్ గవర్నెన్స్ బాడీ. శ్రీ విమల్ మహేంద్రు భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఐఈసి వైస్ ప్రెసిడెంట్‌గా ఉంటారు.

# మధుమేహం,థైరాయిడ్ వ్యాధుల నుంచి కొత్తిమీర నుంచి ఉపశమనం



న్యూఢిల్లీ నవంబర్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );.: ఆహార పదార్థాల్లో రుచిని పెంచే కొత్తిమీరతో పలు ఆరోగ్య ప్రయోజనాలున్నాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. కొత్తిమీర రక్తంలో చక్కెర నిల్వలను నియంత్రించి మధుమేహ ముప్పును నివారిస్తుంది. థైరాయిడ్ వ్యాధుల నుంచి కూడా కొత్తిమీర ఆకులు, విత్తనాలు ఉపశమనం కల్పిస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఎండోక్రైన్ గ్రంధి థైరాయిడ్ హార్మోన్ల స్థితిగతులు, జీవక్రియలను నియంత్రిస్తుంది. వ్యక్తి శరీరంలోని హార్మోన్లలో అసమతుల్యత ఏర్పడితే థైరాయిడ్ సమస్యలు చుట్టుముడతాయి. థైరాయిడ్ సమస్యల నుంచి బయటపడేందుకు కొత్తిమీర ఉపయోగపడుతుందని చెబుతున్నారు. థైరాయిడ్ రోగులకు కొత్తిమీర ఎంతో మేలు చేస్తుందని న్యూట్రిషనిస్ట్, క్లినికల్ డైటీషియన్ ప్రాచీ షా చెబుతున్నారు. కొత్తిమీరలో ఉండే యాంటీఆక్సిడెంట్లు థైరాయిడ్ వంటి వ్యాధుల నుంచి మన శరీరాన్ని కాపాడతాయి. ఇంకా కొత్తిమీరను తరచూ తీసుకుంటే కొలెస్ట్రాల్ లెవెల్స్ తగ్గడంతో పాటు, బరువు తగ్గడం వంటి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని ప్రాచీ షా పేర్కొన్నారు.

# మంత్రి నిరంజన్ రెడ్డికి వినతిపత్రం అందజేత



ఖమ్మం, నవంబర్ 25: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మంజిల్లా రఘునాథపాలెం మండలం జింకల తండా రోడ్ లో నూతనంగా నిర్మించిన వేర్ హౌసింగ్ గోడౌన్ ప్రారంభించడానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తో కలిసి ఖమ్మం విచ్చేసిన వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ దడవాయి సంఘం గౌరవ అధ్యక్షులు పగడాల నాగరాజు, సలహా మేరకు గౌరవ సలహాదారులు ఎండి. పాషా, అధ్యక్షులు మోటె కుమార్, సెక్రటరీ ధూప కోటేశ్వరావు, కలసి రాష్ట్రంలో రైతు ఉత్పత్తులు ఏ ప్రభుత్వం కొనుగోలు చేసిన తూకం వేసే డ్యూటీ దడవాయిలకే ఇప్పించగలరని మరియు 58 సంవత్సరాల జీవోను ఎత్తివేసి 65 సంవత్సరాలకు సవరించలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది.

# హైదరాబాద్‌లో రేపు పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం..

హైదరాబాద్, నవంబర్ 25: నగరంలోని పలు ప్రాంతాల్లో రేపు (నవంబర్ 26న) ఉదయం 6 గంటల నుంచి 24 గంటల పాటు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. శివాజీ చౌక్, బాలాపూర్ వద్ద నీటి సరఫరా లీకేజీని పరిష్కరించే పని కారణంగా నీటి సరఫరాకు అంతరాయం కలగనుంది. అయితే, హఫీజ్ బాబానగర్ లో 100 అడుగుల రోడ్డు విస్తరణ ప్రాజెక్టు అలైన్ మెంట్ లో భాగంగా ఎయిర్ వాల్వ్ లను మార్చడం మరో కారణం.

బాలాపూర్, మైసారం, బార్కాస్, అల్మాస్‌గూడ, లెనిన్ నగర్, బడంగ్‌పేట్, ఏఆర్‌సీఐ, మీరాలం, భోజగుట్ట, బుద్వేల్, శంషాబాద్‌లో నీటి సరఫరా నిలిచిపోనుంది.

పైన పేర్కొన్న ప్రాంతాల్లోని నివాసితులు అసౌకర్యాన్ని నివారించడానికి నీటిని పొదుపుగా ఉపయోగించాలని హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (ఊఓచియా:) ఒక ప్రకటనలో కోరింది.

ఈ నెలలో ఇది మూడోసారి..

గతంలో కూడా హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నెల రోజుల వ్యవధిలో ఇది మూడోసారి. నవంబర్ 2న బీహెచ్‌ఈఎల్ ఎంఐజీ కాలనీ, బీహెచ్‌ఈఎల్ ఎల్ఐజీ కాలనీ, చందానగర్, పాపిరెడ్డి కాలనీ, రాజీవ్ హోమ్, తదితర ప్రాంతాల్లో 24 గంటలపాటు తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈ నెల ప్రారంభంలో విడుదల చేసిన ప్రకటనలో హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ పేర్కొంది.

ఉప్పల్, రామాంతపూర్, శ్రీ సాయి ఆర్టీసీ కాలనీ, ఆదర్శ్ నగర్, వెంకట్ సాయి నగర్, శ్రీకృష్ణ కాలనీ, ఓల్డ్ తదితర ప్రాంతాల్లో ఈనెల 17న 24 గంటల పాటు తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని జలమండలి రెండో సారి మరో ప్రకటనలో పేర్కొంది.

# మున్సిపల్ కార్మికున్ని పరామర్శించిన సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎల్లారెడ్డి



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 25: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణ మున్సిపల్ కార్మికుడు ప్రమాదశాత్తు ట్రాక్టర్ పై నుండి కింద పడి వేములవాడ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెంట రాజును శుక్రవారం సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి మున్సిపల్ వర్కర్ ఐ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుర్రం అశోక్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన రాజుమున్సిపల్ పాలకవర్గం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. వారి వెంట పందుల మల్లేశం, మరాటి రాజయ్య,నామాల వేణు, కల కల్లె పల్లి నరసయ్య, పెంట నరేష్ ఉన్నారు.

